J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 14

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 43 సంచిక : 9 04.8.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి






# సమస్యలు తీర్చకుంటే ఉద్యమం తప్పదు

## - విద్యుత్ ఉద్యోగసంఘాల నాయకుల స్పష్టీకరణ

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను ఇకనైనా ప్రభుత్వం పట్టించుకోకుంటే ఉద్యమం తప్పదని ఉద్యోగ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఇటీవల నెల్లూరులోని విద్యుత్‌భవన్ ఎదుట ఏపీ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ కో-ఛైర్మెన్ కెవి శేషారెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు భోజన విరామసమయంలో తమ నిరసనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి పనికితగ్గ వేతనాలు ఇవ్వాలని, 1999-2004 మధ్య చేరిన ఉద్యోగులకు ఇపిఎఫ్, జీపిఎఫ్ వర్తింపజేయాలని, జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులను క్రమబద్ధీకరించి వారి సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఇప్పటిదాకా పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. జేఏసీ జిల్లా ఛైర్మెన్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో విద్యుత్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. జిల్లా జేఏసీ కన్వీనర్ టి. శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి దొరస్వామిరెడ్డి, ఉపాధ్యక్షులు డి.శ్రీనివాసులురెడ్డి, విక్టర్, అనిల్‌కుమార్, వి.వెంకటేశ్వర్లు, ప్రసాద్, ఎస్‌డి రఫీ తదితరులు ఈ నిరసనలో పాల్గొన్నారు.

# స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా..రమణారెడ్డి



నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది దాట్ల రమణారెడ్డి స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. పలు కేసుల్లో ప్రభుత్వం తరపున ఆయన వాదనలు వినిపిస్తారు. ఈ పదవిలో ఆయన మూడేళ్ళపాటు కొనసాగనున్నారని సమాచారం.

# మొక్కలు నాటండి..పర్యావరణం కాపాడండి

## - ట్రైనీ కలెక్టర్ విద్యాధరి



పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి మొక్కలను నాటి సంరక్షించాలని ట్రైనీ కలెక్టర్ విద్యాధరి చెప్పారు. ఇటీవల ఆమె ఆత్మకూరు మార్కెట్ యార్డ్ ఆవరణంలో ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి, మునిసిపల్ ఛైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మలతో కలసి మొక్కలు నాటారు. అందరూ తమ ఇళ్ల ముంగిట మొక్కలు పెంచుకోవాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. తహశీల్దార్ లక్ష్మీనరసింహం, అటవీశాఖ, మెప్మా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# మణిపూర్ ఘటనలు దారుణం

## • న్యాయవాదుల ఆందోళన




మణిపూర్‌లో జరిగిన, జరుగుతున్న హింసా కాండలు ఎంతో దారుణమంటూ ఆ అఘాయిత్యాలను నిరసిస్తూ నెల్లూరులోని న్యాయవాదులు ఇటీవల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున కొవ్వొత్తులతో తమ నిరసనలు తెలియజేశారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో జరిగిన ఈ ఆందోళనలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉమామహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, స్త్రీలను మాతృమూర్తులుగా పవిత్రంగా భావించే మనదేశంలో మహిళలపై సమాజం సిగ్గుపడేలా హేయమైన సంఘటనలు జరగడం ఘోరమన్నారు. మణిపూర్‌లో మహిళలపై హింసలకు ఒడిగడుతున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. బార్ అసోసియేషన్ ఇన్‌చార్జి సెక్రటరీ షేక్ అన్వర్‌బాషా, కోశాధికారి డి.రమేష్, న్యాయవాదులు తన్నీరు కోటయ్య, రేవూరు శశికళ, షేక్ నన్నేసాహెబ్, నావూరు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# బియ్యం ఎగుమతులపై నిషేధం ఎత్తివేయాలి

బాస్మతీ బియ్యం మినహా, ఇతర రకాల బియ్యం ఎగుమతులపై కేంద్రప్రభుత్వం విధించిన నిషేధాన్ని వెంటనే ఎత్తివేయాలని రైతు సంఘం నాయకుడు కోటిరెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల నెల్లూరులోని సిఐటియు కార్యాలయంలో జరిగిన రైతుసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కనీస మద్దతు ధరలను నిర్ణయించి, దాని అమలుకు చట్టం తీసుకురావాలని ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్రంలో వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘాల నాయకులు రఘురామయ్య, శ్రీనివాసులు, మాధవరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జొన్నవాడ కామాక్షమ్మకు

# స్వర్ణ తిలకం

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలో కొలువైవున్న శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి పల్లరెండ్డి రాఘవరెడ్డి-సుజాతమ్మ దంపతులు ఇటీవల బంగారు తిలకం బొట్టును సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు దాతలను స్వాగతించి, ఆలయంలో ప్రత్యేకపూజలు చేయించి ఆశీర్వదించారు.

## గ్రామదేవతల

# ఆలయాల్లో చోరీలు

దొంగలు గ్రామదేవతల ఆలయాల మీద కన్నేశారు. ఎక్కడ వీలైతే అక్కడ చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల కందుకూరు నియోజకవర్గంలోని ఉలవపాడులో ఉన్న గ్రామదేవతలు పోలేరమ్మ, కనక దుర్గమ్మ ఆలయాల్లో దొంగలుపడి హుండీలను అపహరించుకుపోయారు. ఆలయాలకు ఉన్న తాళాలను పగలగొట్టి లోపలకి వెళ్ళి హుండీలను ఎత్తుకుపోయారు. వాటిలో భక్తులు సమర్పించిన కానుకలు కనీసం 30వేల రూపాయల దాకా ఉండవచ్చని భావిస్తున్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగి దుండగుల కోసం గాలింపు చేపట్టారు.

## ఆటోలకు పర్మిట్లను

# పునరుద్ధరించుకోవాలి

నెల్లూరులోని ఆటో యజమానులు అయిదేళ్ళ పర్మిట్ పూర్తయిన వెంటనే తమ ఆటోల పర్మిట్‌లను పునరుద్ధరించుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ కార్తీక్ పవన్‌కుమార్ హెచ్చరించారు. ఆటోలకు కళ్లు చెదిరే లైట్లను ఏర్పాటుచేయకూడదని, అలాంటివి ఉంటే తొలగించుకోవాలని సూచించారు.

## పశువుల పెంపకంలో

# జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లాలో పశువులు, ఇతర మూగ జీవాల పెంపకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ అధికారులు సూచించారు. ఇటీవల నెల్లూరులోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మహేశ్వరుడు పాల్గొని నేషనల్ ఇన్వెస్టర్ మిషన్ స్కీమ్‌పై అధికారులకు అవగాహన కలిగించారు. ఎల్‌పీఎం విభాగాధిపతి ప్రొఫెసర్ గంగాధర్, డిఎల్‌డిఏ ఇఓ డాక్టర్ సోమయ్య, వ్యవసాయాధికారులు చైతన్యకిషోర్, నాగమణి పాల్గొన్నారు.

# ఉద్యానపంటలపై అవగాహన

ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరు సచివాలయం-2 పరిధిలోని రైతుభరోసా కేంద్రంలో ఇటీవల ఉద్యాన పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కొబ్బరితోటల్లో చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను శాస్త్రవేత్త డి.విజయకుమార్ రైతులకు వివరించారు. ఉద్యానశాఖ అధికారి రెడ్డి ప్రసన్న, వైకాపా నాయకుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీ 'డైకీ' పరిశ్రమ వితరణ

## రామచంద్రాపురం స్కూల్‌లో రూ 20.50 లక్షలతో వసతులు



శ్రీసిటీలోని డైకీ అల్యూమినియం ఇండియా లిమిటెడ్ పరిశ్రమ వితరణతో సత్యవేడు మండలం రామచంద్రాపురం మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొత్తగా తరగతి గది రూపొందింది. ఆ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.20.50 లక్షల రూపాయల వ్యయంతో తరగతి గదితో పాటు, మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదిలో స్టూడెంట్ డెస్కులు, బెంచీలు కూడా ఏర్పాటు చేశారు. శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో డైకీ పరిశ్రమ యాజమాన్యం ఈ వితరణకు ముందుకొచ్చింది. డైకీ మేనేజింగ్ డైరెక్టర్ ఫుజివారా తొషియుకి పాల్గొని నూతన తరగతి గదిని ప్రారంభించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో డైకీ పరిశ్రమ సీఎస్సార్ చర్యలను అభినందించారు. గ్రామ సర్పంచ్ పార్వతి సన్యాసయ్య, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్, సెక్యూరిటీ హెడ్ వై.రమేష్, శ్రీసిటీ ఫౌండేషన్ మేనేజర్ సురేంద్రకుమార్, డైకీ డెప్యూటీ డివిజనల్ మేనేజర్ గౌరవ్ భల్లా, హెచ్‌ఆర్ మేనేజర్ రఫీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తదితరులు డైకీ పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం



ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీసిటీలోని అకార్డ్ స్కూల్ విద్యార్థులు ఇటీవల పరిసరాల శుభ్రత, ర్యాలీ కార్యక్రమాల్లో పాల్గొని, వ్యర్థాలను ఏరివేసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్రిన్సిపాల్ బృందా మాట్లాడుతూ, పచ్చదనాన్ని పరిశుభ్రతను కాపాడుకోవాలంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు ఫిలిప్, రజీనా, రమేష్, కిరణ్మయి తదితరులు పర్యవేక్షించారు.

# ఆదూరమ్మకు కావిళ్ళతో పొంగళ్ళు



చేజర్ల మండలంలోని ఆదూరుపల్లి గ్రామదేవత ఆదూరమ్మ అమ్మవారికి జులై 30 ఆదివారం రోజున వేడుకగా పొంగళ్ళ ఉత్సవం నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా ప్రతిఏటా గ్రామస్తులు ఏడాదికోసారి పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివెళ్లి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పొంగళ్ళు నైవేద్యంగా సమర్పిస్తుండడం ఎంతోకాలం నుంచి వస్తున్న ఆనవాయితీ. ఈ వేడుకలో భాగంగా గ్రామస్తులు ఆరోజున కావిళ్ళతో అమ్మవారికి పెద్దఎత్తున పొంగళ్ళు మోసుకుని తెచ్చి సమర్పించారు. తప్పెట్లు తాళాలు, కొమ్ము వాద్యాలతో, బాణసంచా వేడుకలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్ళి అమ్మవారికి పొంగళ్లు పెట్టి, అమ్మవారి కరుణతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.

# రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలి

దేశవ్యాప్తంగా ఉన్న రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని ఆలిండియా రేషన్ డీలర్ల ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి మునగా గిరిజారావు డిమాండ్ చేశారు. జులై 29న ఆయన నెల్లూరులో విలేకర్లతో మాట్లాడుతూ, తాము కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, సాధ్వి నిరంజన్‌జ్యోతిని కలసి ఇటీవల సంప్రదింపులు జరిపామని, వారు సానుకూలంగా స్పందించి తమ సమస్యలను ప్రధాని నరేంద్రమోడీ దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారని తెలిపారు. 'ఒకే దేశం-ఒకే రేషన్-ఒకే కమిషన్' విధానాన్ని అమలుచేయాలని తాము కోరామన్నారు. తమ సమస్యలపై కేంద్రం స్పందించకుంటే వచ్చే ఏడాది జనవరి 16న ఢిల్లీలో సభను నిర్వహించి, అనంతరం పార్లమెంట్ మార్చ్ చేపడతామన్నారు. రేషన్‌డీలర్లకు గౌరవ వేతనంగా నెలకు రూ.50వేలు ఇవ్వాలని, రేషన్ పంపిణీ విషయంలో అన్ని రాష్ట్రాల్లో ఒకే విధానం అమలుచేయాలని తాము కోరుతున్నట్లు చెప్పారు.

# రెవెన్యూశాఖలో ఖాళీల భర్తీకి చర్యలు

జిల్లా రెవెన్యూశాఖలో ఖాళీగా ఉన్న 46 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి సంబంధించి గత ఏప్రిల్‌లో రాతపరీక్ష జరిగిందని, అందులో అత్యధిక మార్కులు సాధించినవారికి 1:2 నిష్పత్తి ప్రకారం ఆగస్టు 5న, ఉదయం 10 గంటలకు రాజుపాళెంలోని శ్రీ వేంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజీలో కంప్యూటర్ బేస్ట్ టెస్ట్ (సిబిటి) జరుగుతుందని డిఆర్ఓ వెంకటనారాయణమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 14




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 9 04.8.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



## మాట పెదవి దాటితే... పదవి ఊడిపోయే ప్రమాదముంది

# నాయకులారా!.. నోరు జాగ్రత్త



### బూతులతో పోటీ, వ్యక్తిగత విమర్శలలో మేటి - అధికారపక్షం, ప్రతిపక్షం ఇద్దరిదీ ఒకే పోకడ

'నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది'.. ఇది మనకి పెద్దలు చెప్పిన సామెత. ఆ మాటలను ఈ తరం రాజకీయ నాయకులు పూర్తిగా పెడచెవిన పెట్టారు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను అరిషడ్వర్గాలు అని అంటారు. ఈ 6 గుణాలు మనిషిని ఏ స్థాయికైనా దిగజారుస్తాయి. మనిషి పతనానికి, ప్రకృతి వినాశనానికి కారణమవుతాయి. శత్రువులను జయించాలనుకున్న వాళ్లు ఎవరైనా ముందుగా ఈ ఆరు లక్షణాలను జయించాలి. అలాంటివాళ్ళే పరిపూర్ణమైన పరిపక్వత కలిగిన వ్యక్తులుగా సమాజంలో రాణించగలుగుతారు. 'నేను' అన్న అహాన్ని విడిచిపెట్టి, 'మనం' అన్న మాటకు ప్రాధాన్యం ఇవ్వగలిగినవాళ్లే నిజమైన సమాజ శ్రేయోభిలాషులుగా చెప్పొచ్చు. ముఖ్యంగా ప్రజలను పరిపాలించాలని వచ్చే నాయకులకు ఆ లక్షణాలు చాలా అవసరం. అలాంటి నాయకులు నేటి తరంలో ఎవరైనా ఉన్నారా? అంటే... భూతద్దం పెట్టి వెతికినా దొరకడం కష్టమే అని ఖచ్చితంగా చెప్పొచ్చు. భారతదేశంలోని ఇతర ప్రాంతాలను విడిచిపెడితే మన రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయ నాయకులు మాట్లాడుతున్న భాష, పరస్పరం వాళ్లు తిట్టుకుంటున్న పద్ధతి చూస్తుంటే సామాన్యజనానికి అసహ్యం కలుగుతుందంటే అతిశయోక్తి కాదు. పతనమవుతున్న విలువలకు

10లో



రాబోయే సార్వత్రిక ఎన్నికలలో నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం నుండి ప్రస్తుత రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. ఇటీవల ఈ విషయం ఆయనే స్వయంగా ప్రకటించారు. జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మంగళహారతులు పడుతున్నారని, రాబోవు ఎన్నికలలో జనం మళ్ళీ జగన్‌ని ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేస్తారన్న భరోసా తనకు ఉందని అన్నారు వీపీఆర్.

'వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి'....(వీపీఆర్) అంటే నెల్లూరుజిల్లాలో ఒక బ్రాండ్. ఒక్క నెల్లూరుజిల్లాలోనే కాదు, ప్రముఖ వ్యాపారవేత్తగా, సామాజిక సేవకుడిగా,

10లో

## • పెద్దల సభ నుండి ప్రజాక్షేత్రంలోకి

## నెల్లూరు లోక్‌సభ వైసీపీ అభ్యర్థిగా

# వీ పీ ఆర్

N.B.K.R. INSTITUTE OF SCIENCE AND TECHNOLOGY
(AUTONOMOUS)
Estd:1979
Affiliated to JNTUA, Ananthapuramu
Vidyanagar, Tirupati Dt. Phone : 8985382247, www.nbkrist.org

OUR CREDENTIALS

EAPCET CODE NBKR

- Courses accredited by NBA under tier - 1
- Accredited by NAAC with 'A' grade
- Accorded 'A' grade by Government of AP
- College with Potential for Excellence
- Robotics Research & Training Center
- ICT ACADEMY Premier Member
- TATA TCS Accredited Institution
- SAEINDIA Collegiate Club
- CYIENT Empaneled Institution
- MEIDEN Japanese Skill Transfer Programme

Courses Offered: B.Tech.
•CSE •CSE (AI & ML)
•CSE (DS) •AI & DS •IT
•ECE •EEE
•MECHANICAL •CIVIL

COLLEGE BUS FACILITY FROM
Nellore | Gudur | Naidupeta | Sullurupeta | Tada | Venkatagiri
Muthukuru | Mallam | Podalakuru | Rapuru, Sydapuram & Srikalahasti

• Year-wise separate hostel facility for boys
• Well - protected enclosed hostel for girls

N.C.C.
ARMY WING
NAVAL WING



NEDURUMALLI RAMKUMAR
CORRESPONDENT

లాయర్
ఆగస్టు 04, 2023

# మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్టే లేదా?

రానురాను మానవ సమాజం దారుణాతిదారుణంగా తయారవుతోంది. సాటి మానవుల్నే అమ్ముకుతినే దౌర్భాగ్య దుస్థితి ఆవరించింది. అందులోనూ మానవీయ దేశంగా, శాంతికి నిలయంగా చెప్పుకునే మనదేశంలో అత్యంత హేయమైన, జుగుప్సాకరమైన నేరప్రవృత్తులు అంతకంతకూ పెరిగిపోతున్నాయే తప్ప తగ్గడమన్నదే ఉండకపోవడం విచారకరం. అమానవీయమైన మానవ అక్రమ రవాణా వ్యాపారం కూడా మనదేశంలో మరింత జోరుగా సాగుతోండడం బాధాకరం. ముఖ్యంగా వేలాదిగా చిన్నారులు, బాల బాలికలు తరచూ దుండగుల అపహరణకు గురవుతూ ఎవరెవరు ఎక్కడున్నారో, ఏ స్థితిలో ఉన్నారో కూడా తెలియని పరిస్థితి ఏర్పడుతోంది. అక్రమరవాణాదారుల చేతిలో కొందరు బాధితులు తమ మానప్రాణాలను కూడా కోల్పోతున్నారు. గత రెండు మూడేళ్ళుగా ఇలాంటి నేరాలు ఘోరాలు గణనీయంగా పెరిగిపోతూనే ఉన్నాయని నిపుణుల తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఈ నేరాలు కోవిడ్ తర్వాత కూడా 68 శాతం పెరిగాయంటే పైశాచిక మూకలు ఎంతటి దారుణాలకు ఒడిగడుతున్నాయో తేటతెల్లమవుతోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం చూసినా 2019 సంవత్సరం నుంచి కేవలం మూడేళ్ల కాలంలో దాదాపు అక్షరాల పదమూడు లక్షల మంది స్త్రీలు, బాలికలు కనిపించకుండా పోయారంటే మనదేశంలో మానవ అక్రమ రవాణా ఎంత తీవ్రస్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. నేటికీ దేశంలో మానవ అక్రమరవాణాలో జైపూర్ ప్రథమస్థానంలో ఉందని, అక్కడ అత్యధికంగా ఈ నేరాలు జరుగుతున్నాయని అధ్యయనాల్లో తేలింది. అమాయకులైన మహిళలకు మాయ మాటలు చెప్పి లోబరుచుకుని అవసరాలు తీరాక ఏ పశువుల సంతలోనో అమ్మేసినట్లు వ్యభిచార కూపాల్లోకి దింపుతున్నారు. అప్పుల పేరుతో మరికొందరిని వలలో వేసుకుంటున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో బాలబాలి కలను అపహరించుకుపోయి వెట్టిచాకిరీ చేయించుకోవడమో లేదా వారి అవయవాలు తొలగించి తెగనమ్ముకుని డబ్బు చేసుకోవడమో జరుగుతోందని సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మానవ అక్రమ రవాణాల్లో ఆరితేరిన అలాంటి ముష్కర మూకలకు దేశంలో కొదవలేదు. అలాంటి కీచకుల చేతికి చిక్కి ఎందరో స్త్రీలు, బాలలు అనునిత్యం నానా చిత్రహింసలకు, లైంగిక దాడులకు గురవుతూనే ఉన్నారు. అనేకమంది రైల్వే ప్లాట్‌ఫారాల మీదా, బస్టాండ్లు, హోటళ్ళలో యాచనో లేదా చాకిరీయో చేస్తూ జీవితాలు అత్యంత దయనీయంగా కొనసాగిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మాయగాళ్ళ మూకలు యథేచ్ఛగా స్వైర విహారం చేస్తున్నా ప్రభుత్వాలు, పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం ఘోరం. కొన్ని రాష్ట్రాల్లో ఈ నేరాలు అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం, తప్పిపోయిన బాలలను, 18 ఏళ్ళలోపు వయసున్నవారిని గుర్తించి వారిని రక్షించడంతో సుమారు 13వేల మందికి పైగా బాలలకు విముక్తి కలగడం కొంతలో కొంత ఊరట కలిగించే విషయం. అన్ని రాష్ట్రాల్లోనూ అలాంటి గట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ఘోరాలను అరికట్టేందుకు మన రాష్ట్రం మరింత శ్రద్ధ తీసుకోవాలి. దేశంలో మానవ అక్రమరవాణా కేంద్రాలుగా విలసిల్లుతున్న రాష్ట్రాల్లో ఆంధ్ర ప్రదేశ్ కూడా ఉండడం, ఉత్తరప్రదేశ్, బీహార్‌ల తర్వాత స్థానం ఏపీదే కావడం గమనార్హం. ఏపీలో బాలల అక్రమ రవాణాకి సంబంధించిన కేసులు ఏడాదికేడాది పెరుగుతూనే ఉన్నాయి. ఎన్ని రకాల చట్టాలున్నా బాలలపై అఘాయిత్యాలకు పాల్పడేవారిని, మహిళలపై అత్యాచారాలు, అకృత్యాలు చేసేవారిని నిలువరించలేకపోతున్నాయి. 2021లో రాష్ట్రంలో 3720 మంది చిన్నారులు అక్రమ రవాణాకు గురైతే, అందులో బాలికలు 2981 మంది దాకా ఉన్నారని అధికారిక లెక్కలే చెప్తున్నాయి. పుట్టుపేదరికంతో, అజ్ఞానంతో, అమాయకత్వంతో అనేక నిరుపేదల కుటుంబాలకు చెందిన బాలబాలికలు, స్త్రీలు ఎక్కువగా ఈ అపహరణలకు గురవుతున్నారని, దుండగుల చేతికిచిక్కి వారి జీవితాలు చీకట్లో మగ్గిపోతున్నాయని నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళల రక్షణ, బాలల సంరక్షణ అనేవి నామమాత్రంగానే ఉంటుండడం, మిస్సింగ్ కేసుల విషయంలో ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో అక్రమరవాణాదారులు నిర్భయంగా నిరంతరం ఈ ఘోరాలకు పాల్పడుతూనే ఉన్నారు. ఇకనైనా కఠిన చర్యలు తీసుకొని నేరగాళ్ళ పని పట్టకపోతే బాలల భవితకు, మహిళల మనుగడకు ముప్పువాటిల్లుతుంది. మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసేందుకు పోలీసుశాఖతో పాటు అన్ని శాఖల అధికారులు, స్వచ్ఛందసంస్థల వారితో కలిసి.. సమిష్టిగా పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

# గోడమీద పిల్లిలా భాజపా...

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

ఆంధ్రా రాజకీయం విషయంలో గోడమీది పిల్లి సామెత గుర్తొచ్చేలా మోడీ – షా ద్వయం వ్యవహరిస్తున్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికలలో గతమంతటి ఘనంగా కాకపోయినా 25 లోక్‌సభ సీట్లలో 18 నుండి 20 వరకు ఖచ్చితంగా వైసీపీకి వస్తాయన్నది ఆ పార్టీ వర్గాల ధీమా. ఇలాంటి తరుణంలో వైసీపీతో తగాదా పెట్టుకునే పని బీజేపీ చేయదు. అలా అని చెప్పి స్నేహహస్తం కూడా అందించదు. రేపు కేంద్రంలో బీజేపీకి కావలసినంత మెజారిటీ రాకపోతే వైసీపీ లాంటి ప్రాంతీయ పార్టీలపైనే ఆపార్టీ ఆధారపడాలి. జగన్ కూడా ఎన్నికలకి ముందు బీజేపీతో దోస్తీకి మొగ్గుచూపకపోవచ్చు. కమలంతో కలిస్తే జగన్‌కి లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుంది. ఆ విషయం ఆయనకి బాగా తెలుసు. బీజేపీ, జనసేన, టీడీపీ కలిసే జగన్‌పై యుద్ధం చేస్తాయని ఆంధ్ర రాష్ట్ర నేతలు అప్పుడప్పుడూ మాట్లాడి ఊహాగానాలకు తెరలేపుతున్నారు తప్ప బీజేపీ అధిష్టానం మాత్రం పెదవి విప్పడం లేదు. వచ్చే ఎన్నికలలో 'ఇండియా' కూటమి ప్రభావం ఏ స్థాయిలో ఉంటుందో చెప్పలేం. ప్రధాని అభ్యర్థి ఎవరన్న విషయంలో కూటమి అనైక్యతే బీజేపీ బలం. రేపటి ఎన్నికలలో వారికి ప్రచార అస్త్రం కూడా అదే. ఇలాంటి తరుణంలో ఆ కూటమిలో లేని వైకాపా విషయంలో బీజేపీ ఆచితూచి అడుగేసి గోడమీద పిల్లిలా వ్యవహరిస్తోంది తప్ప, ప్రత్యక్షంగా వ్యతిరేకించడం, మద్దత్తు తెలుపడం రెండూ అనుమానమే...!

*యం. చంద్రమౌళి,* **కొత్త ఢిల్లీ.**

# కలవరపెడుతున్న కళ్ళకలక..!

నా చిన్నప్పటినుండి వినపడుతున్న మాట ఈ కళ్ళ కలక. ఇది సాధారణ అంటు వ్యాధి. జాగ్రత్తగా లేకపోతే దాదాపుగా ప్రతి మనిషినీ పలకరించి వెళ్తుంది. అయితే గత కొద్దిరోజులుగా అన్ని మీడియాల్లో ఈ వ్యాధిని పెద్ద భూతంలా చిత్రీకరిస్తున్నారు. కళ్ళకలక అతి భయానక వ్యాధి అన్నట్లుగా కథనాలను పత్రికలలోనూ సామాజిక మాధ్యమాలలోనూ ప్రచారం చేస్తున్నారు. శరవేగంగా పాకిపోతుందంటూ ప్రజలని కలవరపెడుతున్నారు. గతంలో కూడా ఈ వ్యాధికి ఇంతే తీవ్రత ఉండేది. వైద్యం కోసం ఎక్కువవారు అక్కడ కంటి చుక్కలు వేసుకుని తగ్గించుకునేవారు. ఈ వ్యాధి రాకుండా కూడా నియంత్రించుకోవడానికి చిన్న ట్యూబులలో చుక్కల మందు లభిస్తుంది. అప్పట్లో మీడియా ఇంత వేలంవెర్రిగా ఉండేది కాదు కాబట్టి విషయం బయటకు పొక్కేది కాదు. ఇంటర్నెట్ పుణ్యమా అని ఇప్పుడు గోరంతని కొండంతగా ప్రచారం జరుగుతోంది. నిజానికి కళ్ళ కలకకి అంత కలవరం చెందనవసరం లేదు. అది అంటుకున్నప్పుడు మాత్రం కొంచెం ఇబ్బందికరంగా ఉంటుంది తప్ప అంతగా భయపడి దాక్కోవలసిన పనిలేదు. కొత్తవారిని కలిసినప్పుడు జాగ్రత్తగా ఉండడం, షేక్‌హ్యాండ్ ఇస్తే చేతులు కడుక్కోవడం, చేతివేళ్ళని కళ్ళ దరిచేరనీయకపోవడం.. ఇవన్నీ మనకి కరోనా నేర్పిన పాఠాలే కదా..!

*డి. హరిత,* **గూడూరు.**

# అరుణాచలేశ్వరునికి.. 'భవ్య' నాట్య నీరాజనం

- **అపూర్వం.. నెల్లూరు చిన్నారి సాహసం**
- **3.36 గంటల వ్యవధిలోనే 14 కిలోమీటర్ల గిరిప్రదక్షిణ**



***అరుణాచలం గిరిప్రదక్షిణ అంటే మాటలు కాదు.. 14 కిలోమీటర్ల దూరం నడిస్తే తప్ప ఎంతో పుణ్యప్రదమైన ఆ గిరిప్రదక్షిణ పూర్తి కాదు. భగవంతుని కృప ఉంటే తప్ప అది అందరికీ సాధ్యం కాదంటారు పెద్దలు. ఈ నేపథ్యంలో, నెల్లూరు నగరానికి చెందిన పోస్టల్ శాఖ ఉద్యోగిని చెంచులక్ష్మి-విద్యుత్‌శాఖ అధికారి నల్లంగు సునీల్‌కుమార్‌ల కుమార్తె భవ్యహాసిని ఇటీవల అంతటి కష్టసాధ్యమైన కార్యాన్ని సాధించింది. అలుపుసొలుపు లేకుండా, ఎక్కడా విరామం కానీ, విశ్రాంతి కానీ తీసుకోకుండా ఒకే తన్మయత్వంతో భరత నాట్యం చేస్తూ గిరిప్రదక్షిణ చేసి అరుణాచలేశ్వరునికి అపూర్వమైన రీతిలో నాట్య నీరాజనాలర్పించింది.***

తమిళనాడులోని సుప్రసిద్ధ క్షేత్రమైన అరుణాచలేశ్వరునిపై అపారమైన భక్తితో భరతనాట్య ప్రదర్శన చేస్తూ 14 కిలోమీటర్ల గిరిప్రదక్షిణతో అందరినీ ఆకట్టుకుంది నెల్లూరు చిన్నారి భవ్యహాసిని. సాహసోపేతమైన ఈ కార్యాన్ని సాధించడానికి ఆమె గత కొంతకాలంగా కఠోర సాధన చేసింది. కొండచుట్టూ ఉన్న 14 కిలోమీటర్ల దూరాన్ని నాట్యం చేస్తూనే 3 గంటలా 36నిమిషాల్లో చుట్టి వచ్చింది. వేకువన 5.20 గంటలకు ప్రారంభమైన ఈ నాట్య నీరాజనం ఉదయం 8.56 గంటలకు ముగించి అనంతరం శ్రీ అరుణాచలేశ్వరుని సందర్శించుకుని తన కోర్కెను నెరవేర్చుకుంది. చిన్ననాటి నుంచి భక్తి తత్పరతతో ఎదిగిన భవ్యకు నాట్యమంటే ఎంతో ఇష్టం. 2వ తరగతి చదువుతున్నప్పటినుంచే నాట్యసాధన ప్రారంభించింది. ఇటీవలి వరకు నెల్లూరులోని స్కాలర్ స్కాలర్స్ స్కూల్లో 7వ తరగతి దాకా చదువుకుని, ఇప్పుడు అవెన్యూస్ స్కూల్లో 8వ తరగతి చదువుతోంది. కళాదీప్తి డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో నాట్యగురువులు ఇ.కె సుబ్రహ్మణ్యం, కామాక్షిల వద్ద గత అయిదేళ్ళుగా భరతనాట్యంలో శిక్షణ పొందుతూ, నిర్విరామ నాట్యంలోనూ పట్టుదలతో సాధన చేస్తూ అనేక పుణ్యక్షేత్రాల్లో నాట్యప్రదర్శనలిస్తూ తన ప్రతిభా పాటవాలను నిరూపించుకుంటోంది.

## 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం :

కృషి, పట్టుదల ఉండాలే కానీ సాధించలేనిదేముంది అన్నట్లుగా భవ్య అనన్య సామాన్యమైన రీతిలో నిర్విరామ నృత్య ప్రదర్శనలో అపూర్వమైన ప్రతిభతో ముందుకు సాగుతోంది. తన నృత్యసాధనలో భాగంగా నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండపైకి నాలుగుసార్లు నృత్యం చేస్తూ, ఆ కొండను ఎక్కడం, దిగడంలో పరిణతి సాధించింది. అరికాళ్ళు పగిలిపోయి పుండ్లు పడిపోయినా లెక్కచేయకుండా కఠోర దీక్షతో పలు పుణ్యక్షేత్రాల్లోనూ, నెల్లూరులోని శబరి శ్రీరామక్షేత్రంలోనూ నాలుగు గంటల పాటు విరామం అన్నదే లేకుండా నిర్విరామంగా నాట్య ప్రదర్శన చేసి అందరి కరతాళధ్వనులందుకుంది. గత జులై 8వ తేదీన నెల్లూరు టౌన్‌హాలులో రోటరీక్లబ్ వారు నిర్వహించిన కార్యక్రమంలో నిర్విరామ నృత్యం చేసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అందుకుని, టిటిడి ఉత్తరభారత దేశ ఆలయాల స్థానిక సలహామండలి-న్యూఢిల్లీ అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రశంసలు కూడా అందుకుంది. ఈ సందర్భంగా అనేక పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో భవ్య పేరు మారుమ్రోగింది. నెల్లూరులో జిల్లా కలెక్టర్ సమక్షంలో వాల్మీకి జయంతి రోజున, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతుల సారథ్యంలో నెల్లూరులో జరిగిన శ్రీ వేంకటేశ్వరస్వామి వైభవోత్సవాల్లోను, టిటిడి-శ్రీ వేంకటేశ్వర కల్యాణ మహోత్సవ సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన భక్తి కార్యక్రమాల్లోనూ తన నాట్యంతో భక్తాదులను ఆకట్టుకుంది. అంతర్జాతీయ నృత్యదినోత్సవం సందర్భంగా స్కాలర్ స్కాలర్స్ స్కూల్ కరెస్పాండెంట్ పద్మజారెడ్డి సహకారంతో ఒకటిన్నరగంట పాటు నిర్విరామ నృత్య ప్రదర్శన చేసి బాలలందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. తల్లితండ్రులు, నాట్య గురువుల ప్రోత్సాహంతో భవ్య ఇటీవల అరుణాచల క్షేత్రంలో గిరిప్రదక్షిణ చేస్తుంటే, తనతో పాటు ఉత్సాహంగా అనేకమంది భక్తులు నాట్యం చేయడం తనకెంతో ఆనందం కలిగించిందని, ఇలా నిర్విరామ నాట్యప్రదర్శనలతో ఆ భగవంతుడికి నృత్యనీరాజనాలర్పించడంతో పాటు, సాహసోపేతమైన ఈ నాట్య ప్రదర్శనలతో గిన్నిస్‌బుక్‌లో కూడా స్థానం సంపాదించుకోవాలన్నదే తన ధ్యేయమని అంటోంది భవ్య. అంతటి భవ్యమైన లక్ష్యంతో నాట్యసాధన చేస్తున్న భవ్య హాసిని మరింత దీక్షాదక్షతలతో నిర్విరామ నాట్యంలో సాటిలేని మేటిగా నిలవాలని, ఆ చిన్నారి ఆకాంక్ష నెరవేరాలని ఆశిద్దాం!..

# సర్వమత సమానత్వ వేదిక..'రొట్టెల పండుగ' వేడుక

## 10 లక్షలకుపైగా నెల్లూరుకు తరలివచ్చిన భక్తజనం



***సర్వమత సమానత్వానికి వేదికగా..హిందూ ముస్లిమ్ సోదరుల ఐక్యతకు ప్రతీకగా, మత సామరస్యానికి నెలవుగా ఎంతోకాలం నుంచి నెల్లూరు నగరంలోని పవిత్రమైన బారాషహీద్ దర్గా విలసిల్లుతోంది. భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా ప్రసిద్ధి చెందిన ఈ దర్గాలో ప్రతిఏటా నిర్వహించే 'రొట్టెల పండుగ' దేశంలో ఒక్క నెల్లూరులోనే జరుగుతుండడం విశేషం. జులై 29 నుంచి ఆగస్టు 2వ తేది వరకు జరిగిన వేడుకలకు దేశవిదేశాల నుంచి కూడా భక్తజనం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈసారి కనీసం 10 లక్షల మందికి పైగానే భక్తులు వచ్చి రొట్టెల పండుగలో పాల్గొనడం బారాషహీద్ దర్గా ఖ్యాతిని మరింతగా చాటుతోంది.***




దేశం నలుమూలల నుంచే కాక, విదేశాల నుంచి కూడా భక్తజనం తండోపతండాలుగా తరలివస్తుంటారు. ఈసారి ప్రత్యేకించి ఈ వేడుకలు గతంలో కన్నా అంగరంగవైభవంగా జరిగాయి. అయిదురోజుల పాటు దర్గా ప్రాంతమంతా విద్యుద్దీపాలతో కళకళలాడింది. రొట్టెల పండుగలో భాగంగా స్వర్ణాల చెరువులో భక్తులు తమ కోర్కెలను నివేదించుకుంటూ పెళ్ళిరొట్టె, ఉద్యోగం రొట్టె, చదువురొట్టె, ఆరోగ్యరొట్టె, సంతానం రొట్టె, సౌభాగ్యం రొట్టె ఇలా కోర్కెలరొట్టెలు పట్టుకునేందుకు భక్తజనం పోటీలు పడ్డారు. గంధోత్సవానికి కులమతాలకు అతీతంగా భక్తులు ఒక ప్రవాహం వలె దర్గా ప్రాంగణానికి తరలివచ్చారు. మత పెద్దలు, జిల్లా అధికార యంత్రాంగం, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు అందరూ కలసి సమన్వయంతో ఈ వేడుకలను విజయవంతం చేశారు.

బారాషహీద్ దర్గాను దర్శించుకుని, చెంతనే ఉన్న చెరువులో కోర్కెలు రొట్టెలు పట్టుకునే సంప్రదాయం నెల్లూరులో అనాదిగా సాగుతోంది. దర్గాలో సమాధులైవున్న 12మంది ముస్లిమ్ అమరవీరుల మహిమాన్వితమైన శక్తితో దర్గాకు వచ్చిన భక్తుల కోర్కెలు నెరవేరుతుండడంతో ఈ దర్గాకు

### నెల్లూరు ప్రతిష్టను పెంచారు - ఆదాల అభినందన

బారాహషీద్ దర్గాలో రొట్టెల పండుగ వేడుకలను జయప్రదం చేయడం సంతోషకరమని, దేశవ్యాప్తంగా నెల్లూరు నగర ఖ్యాతి మరింతగా ఇనుమడించిందని, జిల్లా అధికారులు, నగరపాలక సిబ్బంది, పోలీసులు తదితరులంతా చేసిన కృషితో వేడుకలు విజయవంతమయ్యాయని ఈనెల 2న దర్గా ఆవరణలో జరిగిన రొట్టెల పండుగ ముగింపు సమావేశంలో నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

## శ్రీసిటీ పరిశ్రమలలో..

# ఫైర్ సేఫ్టీ ప్రమాణాలపై సమీక్ష



రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎ.రవిశంకర్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఇంటెలిజెన్స్) బి.సత్య యేసుబాబు ఇటీవల శ్రీసిటీని సందర్శించి, పరిశ్రమల అగ్నిప్రమాదాల నుంచి రక్షించే వ్యవస్థల(ఫైర్ సేఫ్టీ) ప్రమాణాలను పరిశీలించారు. స్థానిక బిజినెస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పాల్గొని పరిశ్రమల ప్రతినిధులతో పలు భద్రతా అంశాలపై వారు చర్చించారు. పరిశ్రమలకు సంబంధించి ఎంతో ముఖ్యమైన ఫైర్ సేఫ్టీ అంశంపై సమావేశం ఏర్పాటు చేయడంలో డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చొరవను వారు ఈ సందర్భంగా అభినందించారు. అగ్ని కారణంగా సంభవించే పారిశ్రామిక ప్రమాదాలను పరిష్కరించడానికి, ప్రమాదాలను తగ్గించడానికి, ప్రభుత్వం పలు పద్ధతులను అనుసరించడంతో పాటు పని ప్రదేశాలు సురక్షితంగా ఉంచేందుకు ప్రత్యేకచర్యలను సూచిస్తున్నట్లు వారు తెలిపారు.

## • ఆగస్టు 12న అన్నమాచార్య జయంతి

# అన్నమయ్య కీర్తనల భావం తెలిపే వినూత్న కార్యక్రమం



భూమన్





సరస్వతి ప్రసాద్

పదకవితా పితామహులు శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యుల వారి 614వ జయంతిని ఆగష్టు 12 శనివారం నాడు సాయంత్రం నెల్లూరులో నిర్వహించనున్నారు. అన్నమయ్య సర్కిల్ వద్ద గల అన్నమాచార్య విగ్రహ కమిటీకి అనుబంధంగా ఏర్పడిన 'శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటీ' మరియు శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక 'శ్రీవాణి' సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుందని నిర్వాహకులు తెలిపారు. ఆరోజు సాయంత్రం 6 గంటలకి నెల్లూరు మినీబైపాస్ అన్నమయ్య సర్కిల్ వద్ద ఉన్న పివిఆర్ కళ్యాణ మండపంలో 'శ్వేత' మాజీ సంచాలకులు, సుప్రసిద్ధ సాహితీవేత్త భూమన్ ఒక్కొక్క అన్నమయ్య కీర్తనలోని భావాన్ని వివరిస్తారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుడు సరస్వతి ప్రసాద్ ఆ కీర్తనలు ఆలపిస్తారు. నెల్లూరులోని శ్రీ గురు కృప కళాక్షేత్రం విద్యార్థినులు అన్నమయ్య కీర్తనలతో నాట్యారాధన చేస్తారు. అత్యంత వినూత్న తరహాలో ఈ కార్యక్రమానికి నిర్వాహకులు రూపకల్పన చేశారు. అదేరోజు సా. 5.30 గంటలకి అన్నమయ్య విగ్రహం వద్ద పూజా కార్యక్రమం నిర్వహించి, అక్కడినుండి నగర సంకీర్తనలతో పివిఆర్ ప్రాంగణానికి చేరుకుంటారు. ఆధ్యాత్మికతత్పరులు, సంగీత, సాహిత్య, సాంస్కృతిక, కళారంగాల అభిమానులు, కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు సంప్రదాయ దుస్తులలో రావలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.


# పర్వతరెడ్డికి మరో పదవి

## ➢ వెంకటగిరి వైసీపీ పరిశీలకుడిగా నియామకం



***మనిషి జీవితం ఏ క్షణాన ఎలాంటి మలుపు తీసుకుంటుందో, అదృష్టం ఎప్పుడు ఎవరిని వరిస్తుందో చెప్పడానికి తాజా ఉదాహరణ కృష్ణచైతన్య విద్యాసంస్థల సారథి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి. ఆయనని ఇప్పుడు పదవులు వెంటపడి వరిస్తున్నాయి.***

గుట్టుగా పిల్లలకు చదువు చెప్పుకుంటూ ఏవో తనకి తగ్గ వ్యాపారాలు చేసుకుంటూ, అడపాదడపా సాంఘిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటుండిన చంద్రశేఖరరెడ్డి జీవితాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ ఎన్నికలు అతిపెద్ద మలుపు తిప్పాయి. రెడ్‌క్రాస్‌లో దీర్ఘకాలంగా పాతుకుపోయిన పాత కమిటీపై వున్న అసంతృప్తి చంద్ర ఛైర్మన్‌గా గెలవడానికి దోహదపడింది. అనంతరం ప్రపంచాన్ని మొత్తం వణికించిన కరోనా చంద్రశేఖరరెడ్డి సేవాగుణాన్ని బయటపెట్టి శాసనమండలి ఎన్నికలలో ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థిగా ఆయనను ప్రతిపాదించేలా ఉపకరించింది. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి పాత ఓట్లన్నీ రద్దుచేసి కొత్త ఓట్లు చేర్పించే క్రమంలో ప్రైవేటు టీచర్ల ఓట్లు కూడా చేర్పించొచ్చన్న కొత్త నిబంధన చంద్రశేఖరరెడ్డి ఆ ఎన్నికలలో ఎంఎల్‌సీగా గెలుపొందేలా సహకరించిడంతో శాసనమండలి సభ్యుడయ్యారు. హోరాహోరీగా జరిగిన ఎన్నికలలో విజయం సాధించిన చంద్ర కార్యదక్షత, సమర్థత వైసీపీ అధిష్టాన పెద్దలని ఆకట్టుకుంది. ఫలితంగా ఆయన పార్టీపెద్దలకి దగ్గరై, పూర్తిస్థాయి రాజకీయ నాయకుడైపోయారు. ఇప్పుడు వారి ఆశీస్సులతో వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకుడిగా నియమింపబడ్డారు. భవిష్యత్తులో ఆయన ఇంకా ఉన్నత పదవులు పొంది అత్యున్నత శిఖరాలను చేరుకుంటారని ఆశిద్దాం.



## తృతీయ వర్ధంతి

### తిక్కవరపు బలరామరెడ్డి గారు

జననం : 19.03.1930 నిర్యాణం : 07.08.2020

చిరస్మరణీయం, ఆదర్శనీయం,
అనుసరణీయం వారి జీవితం.
ఆగష్టు 7, 2023న
వారి తృతీయ వర్ధంతి సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

భార్య : తిక్కవరపు హైమావతమ్మ

కుమారులు - కోడళ్ళు
టి.సీతారామిరెడ్డి - అనిత
టి.రామచంద్రారెడ్డి - సుజల

కుమార్తెలు - అల్లుళ్ళు
వేణుంబాక కమల - దినేష్‌రెడ్డి
మాజీ డి.జి.పి., ఆంధ్రప్రదేశ్
మారంరెడ్డి షీల - శివకుమార్‌రెడ్డి

మనుమరాళ్ళు, మనుమలు
సునయన, దిత్య, పూజిత, సంజన
రోహిత్, రితేష్, చేతన్

మరియు
మునిమనుమలు,
మునిమనుమరాళ్ళు

# నెల్లూరు కబుర్లు

## రాహుల్ ప్రధాని కావాలంటూ..
## 'చేవూరు' పూజలు



రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని కోరుకుంటూ డిసిసి అధ్యక్షుడు చేవూరు దేవ కుమార్‌రెడ్డి బారాషహీద్ దర్గా ప్రాంగణంలో ఇటీవల ప్రత్యేక పూజలు చేశారు. కులమతాలకు అతీతంగా నెల్లూరులో అంగరంగ వైభవంగా జరిగిన రొట్టెల పండుగలో ఆయన పాల్గొని, కాంగ్రెస్‌పార్టీ బలోపేతం కోసం బారాషహీద్ దర్గాలోప్రత్యేక ప్రార్ధనలు చేశారు. రాహుల్‌గాంధీ భారతప్రధానిగా అధికారం చేపట్టాలని కోరుకుంటూ స్వర్ణాల చెరువులో ఆయన రొట్టెలు వదిలారు. పీసీసీ కార్యదర్శి ఎన్.మోహన్, డీసీసీ ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్, నెల్లూరు రూరల్, నగర అసెంబ్లీ ఇన్‌చార్జిలు ఉడతా వెంకట్రావు, షేక్.ఫయాజ్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కొండా అనిల్‌కుమార్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పప్పర్తి గణేష్‌బాబు, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు రాజా, మహేష్, షేక్ అల్లావుద్దీన్, షేక్ హుస్సేన్ బాషా, ఐఎన్‌టియుసి అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, షేక్ రిజ్వాన, సుజాత, అరవ దాసు, షేక్ మహబూబ్‌బాషా, మెయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## పింగళి వెంకయ్య జయంతి వేడుకలు



నెల్లూరు, కొండాయపాళెంలో ఉన్న నగరపాలక ప్రాథమిక పాఠశాలలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలను ఇటీవల నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం.భాస్కర్‌రావు విద్యార్థులతో కలిసి ఆ మహనీయుని చిత్రపటానికి నివాళులర్పించారు. పింగళి వెంకయ్య జీవితం గురించి పిల్లలకు తెలియజేశారు. ఆ దేశభక్తుని ఆశయాల బాటలో నడవాలన్నారు. ఉపాధ్యాయుడు హరీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రొట్టెల పండుగలో.. వైద్య సిబ్బంది సేవలు

### సుమారు 10వేల మంది భక్తులకు ఉచిత పరీక్షలు



నెల్లూరు బారాషహీద్ దర్గాలో ఇటీవల అయిదు రోజులపాటు పెద్ద ఎత్తున జరిగిన రొట్టెల పండుగలో జిల్లా వైద్య ఆరోగ్య, ఆయుష్ శాఖల వైద్యులు, సిబ్బంది పాల్గొని లక్షలాదిగా తరలివచ్చిన వివిధ ప్రాంతాల భక్తులకు నిరంతరం అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో మూడు షిఫ్టుల్లో సుమారు 200 మంది వైద్యులు, సిబ్బంది కలసి భక్తులకు సేవలందించారు. సుమారు 5వేలమందికి పైగా భక్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ వైద్య శిబిరంలో మెడికల్ ఆఫీసర్ సురేంద్రబాబు, బ్రహ్మారెడ్డి, షఫీవుల్లా, సుబ్బారావు, రమేష్, ప్రసాద్, శేషయ్య, కిరణ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఆయుర్వేదం, హోమియోపతి, యునాని వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ శిబిరాల్లో మరో 5వేల మందికి పైగా భక్తులకు అవసరమైన ఆయుర్వేద, హోమియో మందులను అందజేశారు. డాక్టర్ గోవింద్, గంగాధర్ పర్యవేక్షణలో డాక్టర్లు జకీరుద్దీన్, పర్వీన్ బాబు, అబ్దుల్ రజాక్, కోమలి, జ్ఞానప్రసూన, సరళ, సుభాషిణి తదితర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు అన్నదానం

కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పిఎంపి) ఆధ్వర్యంలో ఏలూరు రాజేష్ పుట్టినరోజు సందర్భంగా ఏలూరు బాలమ్మ, నాగార్జున, సహనశ్రీ సౌజన్యంతో జులై 31న నెల్లూరులోని పాత మున్సిపల్ ఆఫీస్ ఆవరణంలో ఉన్న నిరాశ్రయుల ఆశ్రయ కేంద్రంలో అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా పి.ఎం.పి గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్, శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ, పుట్టినరోజు, పెళ్లిరోజు సందర్భాల్లో జరిగే శుభకార్యాలకు ఆడంబరాలకు పోకుండా అనాథలు, నిరాశ్రయుల మధ్య కొద్దిసేపు గడపగలిగితే, ఆ బాధితులకు బాసటగా మనమున్నామంటూ భరోసా కల్పించినట్లుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ధర్మవరపు సుబ్బారావు, జిల్లా పి.హెచ్.పి నాయకులు గోరంట్ల శేషయ్య, నరసాపురం ప్రసాద్, దేవరకొండ శ్రీనివాసులు, కె.సాయి స్వరూప్, ఆశ్రమ నిర్వాహకులు డి. సుందరం తదితరులు పాల్గొన్నారు.



## 5న చంద్రబాబు.. జిల్లాకొస్తున్నారు

### టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి

ఆగస్టు 5న టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెల్లూరుజిల్లా పర్యటనకు వస్తున్నారు. పలు కీలకరంగాల్లో పనిచేస్తున్న వారితో సమావేశమై జిల్లాలోని పరిస్థితులను తెలుసుకోవాలన్నది ఆయన పర్యటన ఉద్దేశ్యం. ఇటీవలే ఆయన తనయుడు లోకేష్ జిల్లాలో 'యువగళం' పాదయాత్ర నిర్వహించడం తెలిసిందే. లోకేష్ పర్యటన విజయవంతమైన ఉత్సాహంతో టీడీపీ శ్రేణులు చంద్రబాబు పర్యటనకు కూడా భారీ ఏర్పాట్లు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో, ఆగస్టు 1న నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మాజీమంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నాయకులతో సమావేశమై చంద్రబాబు పర్యటనకు చేయాల్సిన ఏర్పాట్లను సూచించారు. ఈ సమావేశంలో నాయకులు తాళ్లపాక రమేష్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నెలవల సుబ్రహ్మణ్యం, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలల్లో వసతులు లేవంటూ..
## ఏబీవీపీ ఆందోళన



రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు కనీసవసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, కార్పొరేట్ కళాశాలలు, ప్రైవేట్ కళాశాలల్లో అధికఫీజులు వసూలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నిరసన తెలియజేస్తూ జులై 28న ఏబీవీపీ ఆధ్వర్యంలో నెల్లూరులో బంద్ పాటించి స్థానిక కేఏసీ కళాశాల వద్ద పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలల్లో సుమారు 2వేలకు పైగానే పోస్టులు ఖాళీగా ఉన్నా, వాటి భర్తీకి ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవడం లేదన్నారు. ఏబీవీపీ నగర సహాయ కార్యదర్శి నరసింహ, విద్యార్థి నాయకులు రాహుల్, సాయి, సమీర్, సుమన్ తదితరుల ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది.

## 'తంగిరాల మహాభారతం' 66వ భాగం




శ్రీకృష్ణుడు అలా జరాసంధుణ్ణి హెచ్చరించగానే జరాసంధునికి కోపంవచ్చి ఆగ్రహంతో తానేమి తప్పు చెయ్యలేదని, క్షత్రియ ధర్మం ప్రకారంగానే నడచుకుంటున్నానని, మీతో యుద్ధానికి సంసిద్ధుడనని, మీ సైన్యంతో గాని, ముగ్గురితో గాని, లేక ఇద్దరు, లేక ఒకరితో గాని పోరాడతానని సవాల్ చేస్తాడు. అప్పుడు శ్రీకృష్ణుడు తమలో బలవంతుడితో మల్లయుద్ధం చెయ్యమని కోరినప్పుడు జరాసంధుడు భీముని కోరి ఆయనతో 13రోజులు మల్లయుద్ధం చేస్తాడు. ఆఖరిరోజు జరాసంధుడు అలసిపోతాడు. శ్రీకృష్ణుని ప్రోత్సాహం మేరకు భీముడు విజృంభించి జరాసంధుణ్ణి గాలిలో గిరగిరా తిప్పి కింద పడవేసి సంహరిస్తాడు.

మరునాడు శ్రీకృష్ణుడు, జరాసంధుని కుమారుడు సహదేవునికి పట్టాభిషేకం చేసి, కారాగారంలో ఉన్న రాజులని విడిపిస్తాడు. గరుత్మంతుడు సారధిగా, జరాసంధుని దివ్యరథంలో భీమార్జునులతో బయలుదేరి ఇంద్రప్రస్థానికి చేరుకుంటారు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.






## దురలవాట్లు మానండి

### - 'లంగ్ క్యాన్సర్ డే'లో వైద్యుల హితవు -



ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని, ముఖ్యంగా పొగత్రాగడం, పొగాకు నమలడం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని వైద్యులు సూచించారు. ఆగస్టు 1న ప్రపంచ లంగ్ క్యాన్సర్ డే సందర్భంగా నెల్లూరులోని మెడికవర్ ఆసుపత్రి వారి సౌజన్యంతో, స్థానిక ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జి.రంగరామన్ క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగించారు. ప్రాణాంతకమైన ఈ వ్యాధిపట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరోగ్యాన్ని ఇబ్బందిపెట్టే జంక్‌ఫుడ్‌లు తినవద్దని ఆయన సూచించారు. మెడికవర్ ఆసుపత్రి వారి సేవలు అభినందనీయమని ముఖ్యఅతిథిగా పాల్గొన్న నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకనాథ్ కొనియాడారు. మహిళలు ప్రతిఏటా ముందస్తుగా క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకోవడం మంచిదని, ఆయాసం, దగ్గు ఉన్నవారు ప్రాథమికస్థాయిలోనే వైద్యపరీక్షలు చేయించుకొని ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ప్రియ, డాక్టర్ సుస్మితరెడ్డి చెప్పారు. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తలపనేని హరిబాబు, కార్యదర్శి బిరదవోలు రామమోహన్‌రెడ్డి, కోశాధికారి షేక్ నజీర్ అహమ్మద్, వాకర్స్ ఇంటర్నేషనల్-2022 కోశాధికారి నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 'వాణిజ్య రాకెట్' సక్సెస్

- నింగిలోకి జయప్రదంగా పిఎస్ఎల్వి సి-56
- నిర్ణీత కక్ష్యలోకి చేరిన.. 7 సింగపూర్ ఉపగ్రహాలు



శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి జులై 30వ తేదీ ఉదయం 6.30 గంటలకు ప్రయోగించిన పిఎస్ఎల్వి-సి56 (పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్) రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రో (భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ) శాస్త్రవేత్తల్లో ఉత్సాహం వెల్లువెత్తుతోంది. ఇది ప్రత్యేకించి మనదేశానికి వాణిజ్యపరంగా లాభాలు తెచ్చే రాకెట్ కావడం విశేషం. ఇటీవలే చంద్రయాన్ రాకెట్‌ను జయప్రదంగా కక్ష్యలోకి ప్రవేశ పెట్టడం, చంద్రయాన్ మిషన్-3 చంద్రుని వైపు పయనం సాగిస్తున్న నేపథ్యంలో, తాజాగా 420 కిలోల బరువున్న 7 ఉపగ్రహాలతో పిఎస్ఎల్వి సి-56 నింగిలోకి దూసుకుపోవడం, నిర్దేశిత కక్ష్యలోకి ఆ ఉపగ్రహాలను విడిచిపెట్టడం అన్నీ సజావుగా జరిగిపోయాయి. ఇస్రో అధిపతి డా.సోమనాథ్ ఆధ్వర్యంలో ఈ ప్రయోగం దిగ్విజయం కావడంతో షార్ ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ సంస్థతో ఉన్న ఒప్పందంతో ఇస్రో ఈ ప్రయోగాన్ని నిర్వహించింది. ఈ రాకెట్ ప్రయోగంతో ఇప్పటికి ఇస్రో పంపిన విదేశీ ఉపగ్రహాల సంఖ్య 431కి చేరింది. పిఎస్ఎల్వి సీరీస్‌లో ఇస్రోకి ఇది 58వ ప్రయోగం. ఈ ఏడాది ఇస్రో ఖాతాలో ఇది మూడో విజయం. ఇలాంటి వాణిజ్య ఉపగ్రహాల ప్రయోగం ఇస్రోకి ఎంతో లాభదాయకం కూడా. ఈ ఉత్సాహంతో ఇస్రో శాస్త్రవేత్తలు త్వరలోనే మరి కొన్ని రాకెట్లను ప్రయోగించడానికి సమాయత్తమవుతున్నారు. అంతేకాదు, చంద్రయాన్ విజయ పథంలోకి దూసుకువెళ్తున్న నేపథ్యంలో 'గగన్‌యాన్' ప్రయోగానికి కూడా సిద్ధమవుతున్నారు.

# దొంగలు బాబోయ్ దొంగలు

- ఒకే రోజు అయిదిళ్లలో చోరీలు
- భయపడిపోతున్న కావలి ప్రజలు

జిల్లాలో దొంగలు పేట్రేగిపోతున్నారు. అనువుగా కనిపించిన ఇంటినల్లా దోచేస్తున్నారు. కావలిలో ఒక్క రాత్రిలోనే అయిదిళ్లలో దొంగలుపడ్డారు. దొరికిందంతా ఊడ్చుకుపోయారు. జులై 31 వేకువన కావలి మూర్తిశెట్టివారివీధిలో దొంగతనం జరిగింది. అక్కడొక మిద్దెమీద నివాసం ఉంటున్న ఓ ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దొంగలు ఆ ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న సుమారు పాతిక సవర్ల నగలు నట్రా అంతా దోచుకుపోయారు. కింది పోర్షన్‌లో ఉన్న మరో ఇంటి తాళాలు కూడా పగలగొట్టి బీరువాలో ఉన్న అయిదువేల రూపాయలను, సవర బంగారునగను అపహరించారు. అదేవిధంగా వైకుంఠపురంలోని చేవూరివారి తోటలో ఉన్న ఓ ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న రెండు సవర్ల నగలు దొంగిలించుకుపోయారు. ఇదే ప్రాంతంలో మరొక ఇంటిలోనూ, ఆ తర్వాత ఓ బంకులోనూ వరుస చోరీలు జరిగాయి. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

అందరూ నిద్రలో ఉన్నప్పుడు దొంగలు అదను చూసుకుని తాళాలు పగలగొట్టి మరీ.. అందినకాడికి దోచుకుపోతున్నారు. ఈ మాయదారి దొంగలతో కావలి పట్టణంలో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. జిల్లా పోలీసులు గస్తీ ముమ్మరం చేసి, నిఘా పోలీసు బృందాలను అప్రమత్తం చేసి... దొంగల ఆట కట్టించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# దర్గా అభివృద్ధికి కృషి

ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్



గూడూరు పట్టణంలోని హజరత్ సయ్యద్ హాషిం హుస్సేనీ దర్గా షాపింగ్ కాంప్లెక్స్‌లోని నూతన అంగళ్లను ఇటీవల దర్గా ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో శాసనమండలి సభ్యులు బల్లి కళ్యాణ్‌చక్రవర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత నాయకులు, మా తండ్రి బల్లి దుర్గా ప్రసాద్‌రావుకు ముస్లింలతో చక్కటి అనుబంధం ఉండేదని, అప్పట్లో పెద్దలు రియాజ్ అహ్మద్ కోరికమేరకు షాదీ మంజిల్ నిర్మాణం, మైనార్టీ సమస్యలు పరిష్కరించారని గుర్తుచేసుకుంటూ, త్వరలో గూడూరు రెండవ పట్టణంలో ముస్లిం సోదరులకు షాదీ మంజిల్, సిమెంటు రహదారులు ఏర్పాటు చేస్తామన్నారు. దర్గా వెల్ఫేర్ కమిటి అధ్యక్షులు షేక్ రియాజ్‌అహ్మద్, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దర్గా ప్రధాన ముజావర్ మగ్దూమ్, మొహ్మద్ అన్వర్, షాదీమంజిల్ అధ్యక్షులు సయ్యద్ అబ్దుల్‌గఫూర్, గౌరవ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్, మగ్దూమ్, అన్వర్, గఫూర్, సందానీ తదితరులు పాల్గొన్నారు.

# 'కడప ఉక్కు'ను ప్రభుత్వమే చేపట్టాలి

సిపిఎం డిమాండ్




కడప ఉక్కు పరిశ్రమను ప్రభుత్వాలే చేపట్టాలంటూ జులై 31వ తేదీ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిపిఎం కార్యదర్శి జోగి శివకుమార్ మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ లాభదాయకం కాదని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి పార్లమెంటులో లిఖితపూర్వకంగా చెప్పడం, కడప ఉక్కు పరిశ్రమ నిర్మించడం సాధ్యం కాదని బిజెపి ప్రభుత్వం ప్రకటించడం సిగ్గుచేటని, ప్రభుత్వ రంగంలో లాభదాయకం కాని ఈ ఉక్కు పరిశ్రమ ప్రైవేట్ కంపెనీ 'జిందాల్'కు ఎలా లాభదాయకమవుతుందో బిజెపి ప్రభుత్వం ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. నాయకులు టి.వెంకట రామిరెడ్డి, ఎస్.సురేష్, బి.వి.రమణయ్య, బి.గోపినాథ్, అడపాల ప్రసాద్, పామంజి మణి, బి.చంద్రయ్య, పెంచలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# దోషులను శిక్షించాలి

ఏపి షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షులు ధర్మయ్య



మణిపూర్ మారణకాండలో 145 మంది వరకు మృత్యువాత పడి, వేలాది మంది దాడులకు గురై ఆసుపత్రులపాలైతే, ఆ పరిస్థితులను అక్కడి రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా అణచి వేయకపోవడంతో, ఆ ప్రభావం దేశంలోని అన్నిచోట్ల పడుతుందని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాగిశెట్టి ధర్మయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలుజిల్లాలో ఒక గిరిజన యువకుడి నోటిలో అగ్రకులస్తులు మూత్రం పోస్తూ కాళ్లతో తంతూ పైశాచిక ఆనందాన్ని అనుభవిస్తూ, ఆ దృశ్యాన్ని వీడియోలో చిత్రీకరించి ప్రసారమాధ్యమాల్లో వచ్చేటట్లు నిర్భీతిగా చేస్తే, పక్కనే ఉన్న బాపట్ల జిల్లా అద్దంకి మండలంలో ఎస్టీల మీద అగ్ర కులస్తులు దాడులు చేసి, వారిని భయభ్రాంతులకు లోనుచేయడం జరిగిందన్నారు. ఈ పరిణామాలను సకాలంలో అణచివేసి దోషులను కఠినంగా శిక్షించాలని నాగిశెట్టి ధర్మయ్య కోరారు.

# ఎన్‌బికెఆర్ అధ్యాపకునికి డాక్టరేట్



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో సిఎస్ఇ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వి.వీరరాఘవులు ఇటీవల డాక్టరేట్ పట్టా సాధించారు. 'అన్‌సూపర్‌వైజ్డ్ ఆబ్జెక్ట్ సెగ్మెంటేషన్ అప్రోచ్ ఇన్ వీడియో అనలిటిక్స్' అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనలకు విఎస్‌యు (విక్రమసింహపురి యూనివర్సిటీ) నుంచి డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఎన్‌బికెఆర్ కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి ఆయన్ను అభినందించగా, సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ ఏ.రాజశేఖర్‌రెడ్డి తదితర అధ్యాపకులంతా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే విద్యార్థులు ఉన్నతస్థానానికి చేరుకోవచ్చని గూడూరు డిఎస్పీ ఎం.సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ ట్రస్ట్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్‌పాఠశాలల క్రికెట్ పోటీలలో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు, సేవాసంస్థలు క్రీడలకు అధిక ప్రాధాన్యత కల్పించడం సంతోషంగా ఉందన్నారు. క్రీడలతో శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక వికాసం కలుగుతుందన్నారు. అనంతరం అంతర్‌పాఠశాలల క్రికెట్ టోర్నమెంట్ విన్నర్స్ జట్టు శ్రీ చైతన్య స్కూల్, రన్నర్స్ జట్టు లిటిల్ ఏంజిల్స్ పబ్లిక్ స్కూల్ జట్ల సభ్యులకు ట్రోఫీలు అందించారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, రోటరీ పాస్ట్‌గవర్నర్ కొణిదల మునిగిరీష్, రొటేరియన్ దశరథరామిరెడ్డి, మయూరి శ్యాంయాదవ్, నాగేశ్వరరావు, లవకుమార్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఐక్యపోరాటంతోనే ఉద్యోగుల సమస్యల పరిష్కారం

ఏపి ఎన్‌జీవోల సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 21, 22 తేదీలలో విజయవాడలో నిర్వహించే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు మన్నెపల్లి పెంచలరావు తెలిపారు. గూడూరు పట్టణంలోని ఎన్‌జివో హోంలో ఇటీవల ఆయన కార్యవర్గసభ్యులతో సమీక్షించారు. రాష్ట్ర మహాసభల కరపత్రాలు అందించి గూడూరు ఎన్‌జీవో నాయకులను ఆహ్వానించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కోశాధికారి బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఎన్.ఆంజనేయవర్మ,



తాలూకా అధ్యక్షులు ఎస్.వి.శ్రావణ్‌కుమార్, కార్యదర్శి ఓ.తునాజ్ కుమార్, ఎస్.నాగరాజుకుమార్, అసోసియేట్ అధ్యక్షులు మరియు కార్యవర్గ సభ్యులు ఎన్.అశోక్, ఖాదర్‌భాషా, శివకుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# యువతను ఆకట్టుకున్న.. క్షేత్రప్రచారశాఖ ఎగ్జిబిషన్

- కేంద్రప్రభుత్వ పథకాల పట్ల ప్రజలకు అవగాహన
- పెద్దసంఖ్యలో పాల్గొన్న యువత



నెల్లూరు బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగ సందర్భంగా నెల్లూరు టౌన్‌హాల్ ప్రాంగణంలో క్షేత్రప్రచారశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ అందరినీ బాగా ఆకట్టుకుంది. భారత ప్రభుత్వ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, క్షేత్ర కార్యాలయం, నెల్లూరు వారి ఆధ్వర్యంలో ఆగస్టు 1,2 తేదీల్లో నిర్వహించిన ఈ ఎగ్జిబిషన్‌ను తొలుత జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ డా. ఉషాకిరణ్, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు మాడభూషి శ్రీధర్, భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి తదితరులు ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌కు యువత పెద్ద ఎత్తున తరలివచ్చారు. ముఖ్యంగా ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చంద్రయాన్-3 సెల్ఫీ కౌంటర్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. కేంద్రప్రభుత్వ పథకాలైన స్వచ్ఛభారత్, బేటీ బచావో-బేటీ పడావో' వంటి పథకాలు మొదలుకుని ముద్ర రుణాలు, ఉజ్వల యోజన వంటి వివిధ ప్రజాసంక్షేమ కార్యక్రమాల అమలును, అవి ప్రజలకు ఉపయోగపడుతున్న తీరును ఈ ఎగ్జిబిషన్ కళ్ళకు కట్టింది. ఈ సందర్భంగా క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి మాట్లాడుతూ... భారత ప్రభుత్వ పథకాల ప్రధాన లక్ష్యం ప్రజా సంక్షేమమేనన్నారు. ఈ పథకాల గురించి ప్రజలంతా తెలుసుకుని లబ్ధి పొందాలన్న ఆశయంతో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తరఫున ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం, ఈ సందర్భంగా నిర్వహించిన పెయింటింగ్, వ్యాస రచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. రెండురోజులపాటు జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ దేశభక్తుడు.. జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 2వ తేదీన స్థానిక కృష్ణచైతన్య కళాశాలకు చెందిన ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ బృందాలతో కళాశాల నుంచి వీఆర్‌సి కూడలి, గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా టౌన్‌హాల్ వరకూ ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. అనంతరం టౌన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా సమాచార అధికారి సురేష్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ మాధవి, భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, లోక్‌అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి, డా. మల్లెల రామయ్య, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుజా శామిలి, యోగా గురువు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బీటీఏ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) 23వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఇటీవల నెల్లూరు జడ్పీ సమావేశ మందిరంలో కోలాహలంగా జరిగాయి. ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నూకలపాటి రమణయ్య ఈ సందర్భంగా బీటీఏ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలు ప్రారంభించారు. గత రెండు దశాబ్దాలుగా బీటీఏ డా. బాబాసాహెబ్ అంబేద్కర్ భావజాలంతో పనిచేస్తూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తోందని వక్తలు కొనియాడారు. జిల్లా జైలర్ జీవీ రమణ, బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. మోహన్‌రావు, రాష్ట్ర నాయకులు పల్లం వేణుగోపాల్, ఆదినారాయణ, మాల్యాద్రి, మేరీ స్టెల్లా, మహేంద్ర, కొండయ్య, జిల్లా నాయకులు చిట్టేటి రమేష్, ప్రసాద్, చిన్నయ్య, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఢిల్లీ ధర్నాలో.. బీఎంఆర్

ఆగస్టు 2వ తేదీన న్యూఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద తెలంగాణ రాష్ట్ర వీర శైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో వారి సమస్యల సాధనకు పెద్ద ఎత్తున మహాధర్నా కార్యక్రమం జరిగింది. ఈ ఆందోళన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు, మన నెల్లూరీయులు బీద మస్తాన్‌రావు పాల్గొన్నారు. ఆయనతో పాటు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, తెలంగాణ రాష్ట్ర నాయకులు, వీర శైవ లింగాయత్ లింగ బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మహిళల్లో క్యాన్సర్ నివారణకు..
# ఏం చర్యలు తీసుకుంటున్నారు?

**రాజ్యసభలో బీద మస్తాన్‌రావు ప్రశ్నలు**

మహిళల్లో క్యాన్సర్ వ్యాధి వ్యాప్తి ఏ స్థాయిలో ఉంది?.. దాని నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటని ఆగస్టు 1న రాజ్యసభలో బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) ప్రశ్నల వర్షం కురిపించారు. గత మూడేళ్ళలో క్యాన్సర్ కేసుల వివరాలేమిటి, క్యాన్సర్ నిర్ధారణకు అధ్యయనాలేమైనా చేశారా? తక్కువ ఖర్చుతో క్యాన్సర్ వైద్యం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారా..అంటూ ప్రశ్నించారు. అందుకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ సహాయమంత్రి ప్రొ. సత్యపాల్‌సింగ్ బాఘెల్ సమాధానమిస్తూ, దేశవ్యాప్తంగా నమోదైన క్యాన్సర్ కేసుల వివరాలను తెలియజేశారు. 2020లో 7.12 లక్షల మందికి, 2021లో 7.30 లక్షల మందికి, 2022లో 7.49 లక్షల మందికి క్యాన్సర్ వ్యాధి సోకిందని పేర్కొన్నారు. జీవనశైలి అస్తవ్యస్తంగా ఉండడం, పొగాకు ఉత్పత్తుల వాడకం, మద్యం, అనారోగ్యకరమైన ఆహారం, వాయు కాలుష్యం వగైరాల వల్ల క్యాన్సర్ వస్తోందన్నారు. వ్యాధి నిర్ధారణ, ఆరోగ్యపరిరక్షణకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు కృషిచేస్తోందన్నారు. ఇప్పటివరకు ఎన్‌పి-ఎన్‌సిడి కింద 724 జిల్లా ఎన్‌సిడి క్లినిక్‌లు, 210 జిల్లా కార్డియాక్ కేర్ యూనిట్లు, 326 జిల్లా డే-కేర్ సెంటర్లు, 6110 కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లు ఏర్పాటు చేయబడ్డాయని, క్యాన్సర్ కేర్ సెంటర్లలో సౌకర్యాలను మెరుగుపరచడానికి కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రులలో నిరుపేదలకు ఉచితంగా లేదా అధిక సబ్సిడీతో క్యాన్సర్ చికిత్స అందించబడుతోందని, ఆయుష్మాన్ భారత్ - ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కింద క్యాన్సర్ చికిత్స అందుబాటులో ఉందన్నారు. ప్రధానమంత్రి భారతీయ జనౌషధి పరియోజన (పిఎంబిజెపి) ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నాణ్యమైన జనరిక్ ఔషధాలు అందరికీ అందుబాటు ధరల్లో ఉంచామని, చికిత్సల చార్జీలు కూడా గణనీయమైన తగ్గింపుతో అందుబాటులో ఉన్నాయని వివరించారు.

# కారులో..రూ.50 లక్షల గంజాయి

- ముసునూరు టోల్‌ప్లాజా వద్ద పట్టివేత
- 17 మంది నిందితులు అరెస్ట్




**మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలకు అందరూ దూరంగా ఉండాలని, వాటిని తెలిసో తెలియకో వినియోగించి జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా పోలీసులు ఒకవైపు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో పెద్దఎత్తున అవగాహన సదస్సులు నిర్వహిస్తుంటే, మరోవైపు గంజాయి రవాణా చేస్తున్న అక్రమార్కులు దొడ్డిదారిన తమ పని కానిచ్చేసుకుంటున్నారు. పెద్ద ఎత్తున గంజాయిని విక్రయిస్తూ ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు.**

ఈ నేపథ్యంలో ఇటీవల నిషేధిత మత్తుపదార్థం.. గంజాయిని పెద్దఎత్తున విక్రయం చేసేందుకు సిద్ధపడుతున్న 17 మంది నేరగాళ్ళు కావలి రూరల్ పోలీసులకు దొరికిపోయారు. ముసునూరు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుంటే ఆ గంజాయి అక్రమదారుల ముఠా గుట్టు రట్టయింది. ఆంధ్ర-ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల నుంచి బెంగుళూరుకు కారులో భారీఎత్తున గంజాయిని తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేసి, ఆ కారును, అందులో బస్తాల్లో కట్టివున్న 50 లక్షల రూపాయల విలువచేసే నూరు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, గంజాయిని తరలిస్తున్న అబ్దుల్ సాజిద్, అమర్‌నాథ్ అనే కేరళకు చెందిన వ్యక్తులను అరెస్టుచేశారు. వారి వద్ద నుంచి 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిచ్చిన సమాచారంతో చెన్నాయపాళెం క్రాస్‌రోడ్డ వద్ద దాడులు చేసి, వీరివద్దనే గంజాయిని కొనుగోలు చేసి 60 గంజాయి ప్యాకెట్లను పంచుకుంటున్న 15 మందిని ఒక్కసారిగా అరెస్ట్ చేశారు. మొత్తం ఆ గంజాయినంతా స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేశామని, మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని కావలి డిఎస్పీ వెంకటరమణ ఇటీవల విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి నిందితుల వివరాలు తెలిపారు. నిందితుల్లో కావలి, నెల్లూరు, కోదూరుపాడు, కలిగిరి, ఇందు కూరుపేట మండలంలోని అల్లి మడుగు సంఘం, పోకూరు, కందుకూరు గ్రామాలకు చెందినవారు కూడా ఉన్నారు. భారీస్థాయిలో గంజాయిని స్వాధీనం చేసుకుని, గంజాయి ముఠాను అదుపులోకి తీసుకున్న కావలి రూరల్ సిఐ ఎం.రాజేష్, ఎస్ఐ సుమన్‌లతో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డా.తిరుమలేశ్వరరెడ్డి అభినందించారు.

## ఆంధ్రా ఎన్నికల కోసం...
# అధికార సైన్యాధ్యక్షులు సిద్ధం!

ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకి తొలిసైరన్ మోగింది. రాబోవు ఎన్నికలను సమర్ధవంతంగా జరపడానికి ప్రభుత్వం తరఫున రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషన్ సైన్యాధ్యక్షులను నియమించింది. రాష్ట్రంలోని 175అసెంబ్లీ నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులను నియమిస్తూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా బుధవారం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. పాత, కొత్త నెల్లూరుజిల్లా ప్రకారం గమనిస్తే దిగువ కనపరచిన అధికారులు ఆయా నియోజకవర్గాల ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారు. ఎన్నికలనాటికి ఆ స్థానంలో ఏ అధికారి ఉంటే.. వారు ఈ బాధ్యతలను నిర్వహిస్తారు.

కందుకూరు : సబ్‌కలెక్టర్ / ఆర్.డి.ఓ, కందుకూరు.
కావలి : సబ్‌కలెక్టర్ / ఆర్.డి.ఓ, కావలి.
ఆత్మకూరు : ఆర్.డి.ఓ, ఆత్మకూరు.
కోవూరు : జాయింట్ కలెక్టర్, నెల్లూరు
నెల్లూరు నగరం : కమిషనర్, నెల్లూరు నగర కార్పొరేషన్
నెల్లూరు గ్రామీణం : ఆర్.డి.ఓ, నెల్లూరు.
సర్వేపల్లి : ప్రత్యేక కలెక్టర్, తెలుగుగంగ
ఉదయగిరి : స్పెషల్ డెప్యూటీ కలెక్టర్(ఎల్.ఏ), సోమశిల, ఆత్మకూరు.
సూళ్లూరుపేట : ఆర్.డి.ఓ, సూళ్లూరుపేట.
గూడూరు : సబ్‌కలెక్టర్ / ఆర్.డి.ఓ, గూడూరు.
వెంకటగిరి : జాయింట్ కలెక్టర్, తిరుపతి

# దాహం తీర్చగలగడం.. నా అదృష్టం

## - రాజ్యసభ సభ్యులు, 'సేవాభూషణ్' విపిఆర్



జిల్లాలోని పలు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల దాహం తీర్చేందుకు తమ విపిఆర్ ఫౌండేషన్ తరఫున కృషి జరుగుతుండడం సంతోషంగా ఉందని, అది తన అదృష్టంగా భావిస్తున్నానని ప్రముఖ దాత, రాజ్యసభ సభ్యులు, 'సేవాభూషణ్' వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు ప్రభుత్వాసుపత్రిలో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌లతో కలసి ప్రారంభించారు. గత నెలలో తాను ఈ ఆసుపత్రికి వచ్చినప్పుడు ఇక్కడ ఒక వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయించాలని జిల్లా కలెక్టర్ తనను కోరారని, ఆమేరకు వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశామని తెలిపారు. విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకు జిల్లాలో 105 వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పుడు జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రికి ఈ వాటర్ ప్లాంట్ అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

### మెట్ట ప్రాంతాలకు నీళ్లిచ్చిన దాత..విపిఆర్ - ఎంపీ ఆదాల

జిల్లాలోని మెట్ట ప్రాంతాలైన ఆత్మకూరు, ఉదయగిరి ప్రాంతాలకు నీళ్లు ఇచ్చిన దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అని, 100కు పైగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసి జిల్లా వాసులకు వేమిరెడ్డి ఎంతగానో సహాయపడ్డారని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి ఈ సందర్భంగా ప్రశంసించారు.

# సీఎంని కలిసిన రామ్

జులై 31వ తేదీ సోమవారం తాడేపల్లిలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్, తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, నేదురుమల్లి వారసుడు రామ్‌కుమార్‌రెడ్డి కలిశారు. ముఖ్యమంత్రి వెంకటగిరి పర్యటనలో రామ్ అడిగిన వరాలన్నిటికీ ముఖ్యమంత్రి తథాస్తు అన్నందుకు రామ్ ముఖ్యమంత్రికి తన కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగన్ కూడా 'వెంకటగిరి సభ బాగా చేశారు' అంటూ రామ్‌కుమార్‌ని అభినందించారు.



# జగన్ చిత్రపటానికి పాలాభిషేకం



'నేతన్న నేస్తం' 5వ విడత నగదు పంపిణీ కార్యక్రమంలో భాగంగా తన వెంకటగిరి పర్యటనలో పోలేరమ్మ జాతరని రాష్ట్ర పండుగగా ముఖ్యమంత్రి ప్రకటించడంపట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రామ్‌కుమార్ రెడ్డి పోలేరమ్మకి పూజలు నిర్వహించారు. అనంతరం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వెంకటగిరి నియోజకవర్గ నాయకులతో పాటు పట్టణ కార్పొరేషన్‌కి చెందిన అనేకమంది కార్పొరేటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాకే పరిమితమై ఉన్న పోలేరమ్మ జాతర, ఇప్పుడు రాష్ట్రస్థాయి పండుగ కావడం గర్వించదగ్గ విషయమన్నారు. అక్టోబర్‌లో జరగనున్న పోలేరమ్మ జాతరను ఈసారి రాష్ట్ర పండుగగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని చెప్పారు. అప్పటివరకూ జగన్‌కి కృతజ్ఞతగా పట్టణంలోని ప్రతి వార్డులో సంబరాలు జరుపుకుంటామని రామ్ ప్రకటించారు.

# డిఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

# ఉచిత వైద్యశిబిరం



అల్లూరు మండలం నార్త్‌మోపూరులోని దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ (డిఎస్ఆర్ ట్రస్ట్) ఆధ్వర్యంలో జులై 30న పెద్దఎత్తున ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎనెల్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సహకారంతో చేపట్టిన ఈ శిబిరంలో సుమారు 170మందికి పైగా రోగులకు ప్రముఖ వైద్యులు వైద్య పరీక్షలుచేసి, వారికి ఉచితంగా మందులు కూడా పంపిణీచేశారు. డాక్టర్ డి.మహేంద్రనాథ్‌రెడ్డి (కీళ్లు ఎముకలు నరాల స్పెషలిస్ట్), డాక్టర్ పి.హరికృష్ణ (జనరల్ ఫిజీషియన్), డాక్టర్ హారిక భీమ మరియు డాక్టర్ తరుణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో ఎనెల్ స్పెషాలిటీ హాస్పిటల్ సీఈఓ ఆర్వియస్‌యస్ రవికుమార్, దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి, ట్రస్ట్ మేనేజర్ ఐ.అనిల్‌కుమార్‌రెడ్డి, ట్రస్ట్ డాక్టర్ జెట్టి రమేష్, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌ఛార్జి రామచంద్రారావు, దేవిరెడ్డి శారద హైస్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతాచౌదరి, హోమియో డాక్టర్ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.



# నాయకులారా!.. నోరు జాగ్రత్త

(మొదటి పేజీ తరువాయి)

పరాకాష్టగా వారి బూతుపురాణాలు ఉంటున్నాయి. దిగజారుడుతనానికి ప్రతీకగా వారి ఆరోపణలు వినపడుతున్నాయి. నిరాధార నిందలతో, నీచమైన పదాలతో ఒకరిని ఒకరు తిట్టుకుంటున్న వారి ప్రవర్తన చూసి సమాజం సిగ్గుతో తలదించుకుంటోంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో అధికార వైసీపీతో పాటు ప్రధాన ప్రతిపక్షం టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఒకరిపై ఒకరు చేసుకుంటున్న ఆరోపణలు, ఒకరినొకరు విమర్శించుకుంటున్న తీరు శృతిమించి ప్రజలలో వారిపట్ల ఏహ్యాభావం కలిగేలా ఉంటున్నాయి.

## అధికారపక్షం, ప్రతిపక్షం ఇద్దరిదీ ఒకే దారి

దేశంలోనే సంచలనం అన్నట్లుగా 151 సీట్లతో అధికారంలోకి వచ్చిన వైసీపీ చంద్రబాబుని, ఆయన పార్టీని, పాలనని విమర్శించాల్సిన అవసరం లేదు. ఆయన పాలన బాగలేదు కాబట్టే.. జనం జగన్‌కి ఘనవిజయాన్ని కట్టబెట్టారు. బాబుపై నమ్మకం లేదు కాబట్టే ఆయనని 23 సీట్లకి పరిమితం చేశారు. ఆయన అనుభవంపై విశ్వాసం కోల్పోబట్టే జగన్‌కి జేజేలు పలికారు. బాబు, ఆయన బృందం అధికారంలో ఉన్నప్పుడు వైసీపీని, ఆ పార్టీ నాయకుడిని, శ్రేణులని విమర్శించారు, నిజమే అది వాళ్ళ సంస్కారం. అందుకే ప్రజలు వాళ్ళని ఓడించి మూలన కూర్చోబెట్టారు. తాను గెలిచిన తొలి క్షణం దేశంలోనే గొప్ప ముఖ్యమంత్రిగా పేరుతెచ్చుకుంటానని చెప్పిన మాటలకి జగన్ కట్టుబడి ఉండి ఉంటే బాగుండేది. బాబుని, ఆయన అనుచరగణాన్ని పట్టించుకోకుండా పూర్తిగా రాష్ట్రాభివృద్ధిపై దృష్టిపెట్టి సుపరిపాలనని రాష్ట్ర ప్రజలకి రుచి చూపించి వుండాలి. కానీ అధికారపక్షం అలా చేయలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రితో సహా అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుండి బాబు నామస్మరణం మొదలుపెట్టారు. చినబాబుని, వాళ్ళ బాబుని ఆంధ్ర ప్రజలు మర్చిపోయినా అధికారపార్టీ నాయకులు తరచూ వాళ్ళ పేరు జపిస్తూ ప్రజలకి వాళ్ళని గుర్తుచేస్తూనే వున్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రితో సహా ఆ పార్టీ మంత్రులు, యంపీలు, శాసనసభ్యులు, చోటా నాయకులూ అందరూ తెలుగుదండుపై బూతుల వర్షం కురిపిస్తూనే ఉన్నారు. తమకి తాము కల్పించుకునే ప్రచారం కన్నా అధికారపార్టీ వల్లే బాబు & కోకి ఎక్కువ పబ్లిసిటీ లభించిందన్నది రాజకీయ మేధావుల అభిప్రాయం. చేతిలో అధికారం, కావలసినంత మంది అధికార సైన్యం, చేసింది చెప్పగలిగిన సామర్థ్యం, చేతిలో సొంత మీడియా... జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న అనుకూల పరిస్థితులు. ఇవన్నీ వదిలిపెట్టి ప్రజలు మూలపారేసిన వారిని పదే పదే గుర్తుచేస్తూ వాళ్ళని మళ్ళీ ప్రజలమధ్యకి వచ్చేలా చేయడం వైసీపీ తప్పిదమన్నది వారి భావన.

## పెద్దాయనా తక్కువ తినలేదు...!

తనది నలభైయేళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే డెబ్బైమూడేళ్ళ పెద్దాయన కూడా తన వయసు, స్థాయి, అనుభవం తుంగలో తొక్కి అధికార పార్టీపై విరుచుకుపడుతున్నాడు. 2019లో కేవలం 23సీట్లే వచ్చాయన్న నిరాశ, మానసిక క్షోభ ఒకవైపు ఆయనను బాధిస్తుంటే... మరోవైపు ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్న తన సమకాలీకుడి కొడుకు, ఆయన పార్టీ శ్రేణులు చేస్తున్న విమర్శలు, కామెంట్లు బాబు బాలన్స్‌ని తప్పిస్తున్నాయి. 'సైకో పోవాలి –సైకిల్ రావాలి' అంటూ స్వయంగా ఆయనే స్లోగన్లు మొదలుపెట్టారు. తమ నాయకుడే బూతులు మాట్లాడుతుంటే తామేం తక్కువ తిన్నామా అంటూ తెలుగు తమ్ముళ్లు కూడా బూతులు మాట్లాడడంలో శిక్షణ తీసుకుని మరీ తిట్ల వర్షం కురిపిస్తున్నారు. మహిళలు వినడానికి సైతం అసహ్యించుకునే భాషని మహిళల చేతే మాట్లాడిస్తున్నారు. అధికారపార్టీ నేతలు తమను రెచ్చగొట్టే కొద్దీ రెట్టింపుస్థాయిలో టీడీపీ నాయకులు ప్రతిస్పందిస్తున్నారు. వైసీపీ నేతల మాటలకు ధీటుగా తమ పార్టీ నాయకులు కూడా సమాధానం చెప్పాలని బాబే ఆదేశాలు ఇచ్చే స్థాయికి బాబు దిగారు.

## మేమేం తక్కువ తినలేదన్నట్లుగా బీజేపీ, జనసేన...!

వైసీపీ, టీడీపీ నువ్వా–నేనా అన్నట్లుగా బూతు పురాణాలలో పోటీ పడుతుంటే, మధ్యలో బీజేపీ, జనసేన కూడా దూరుతున్నాయి. మేమేం తక్కువ తినలేదన్నట్లుగా వారి స్టైల్లో వాళ్ళు మాట్లాడుతున్నారు. అందరికీ సమిష్టి శత్రువు జగన్ కావడంతో అందరూ వైసీపీపైనే పడుతున్నారు. మూడు పార్టీల నాయకులను ఎదుర్కొనే క్రమంలో వైసీపీ శ్రేణులకు మాటలు కూడా కరువైపోయాయి. రచయితలను పెట్టి కొత్త బూతులు, తిట్లు రాయించి మరీ తిట్ల దండయాత్ర చేయాల్సిన పరిస్థితి వచ్చేలా ఈ తిట్ల భాగోతం తయారయ్యింది.

## తనని తానే తగ్గించుకుంటున్న జగన్!

తిట్ల పురాణం ఎంత ముదిరితే ప్రజలలో అంత చులకన అవడం ఖాయం. అది అన్ని పార్టీలకు వర్తిస్తుంది. ముఖ్యంగా అధికారపార్టీ ఈ విషయంలో ఎంత సంయనం పాటిస్తే.. ఆ పార్టీ ప్రతిష్ట అంత పెరుగుతుందన్నది రాజకీయశ్రేణుల అభిప్రాయం. వంద సంవత్సరాల చరిత్ర ఉన్న కాంగ్రెస్‌పార్టీ అధినేత్రి సోనియా గాంధీనే ధీటుగా ఎదిరించిన ధీరత్వం జగన్‌మోహన్‌రెడ్డిది. నలభై సంవత్సరాల అనుభవం అంటూ తన తండ్రితోనే పోటీపడ్డ నాయకుడిని ఓడించి మట్టికరిపించిన ఘనత ఈ రాజశేఖరరెడ్డి వారసుడిది. దేశంలో బలంగావున్న ప్రాంతీయపార్టీలని ఏదో ఒక విధంగా లొంగదీసుకోవాలని చూస్తున్న బీజేపీతో ప్రత్యక్ష దోస్తీకి నిక్కచ్చిగా 'నో'చెప్పి, అవసరమైన చోట తగ్గేదేలే అన్నట్లుగా భాజపా అధిష్టానాన్ని నిర్మొహమాటంగా విమర్శిస్తున్న గుండె ధైర్యం జగన్ సొంతం. అలాంటి గుణాలున్న నాయకుడు రెండుచోట్ల ఓడిపోయిన పవన్ కళ్యాణ్ లాంటి నాయకుడి పెళ్లిళ్ల గురించి, ముసలోడు అంటూ చంద్రబాబు వయసు గురించి, ప్రత్యక్ష ఎన్నికలలో పోటీచేసిన మొదటిసారి ఓటమి చవిచూసిన లోకేష్ గురించి మాట్లాడడం... తనని తాను తగ్గించుకోవడమేనని అంటున్నారు విశ్లేషకులు.

ఇలా ఒకరినొకరు బూతులు తిట్టుకునే బదులు, ఎవరి పార్టీ విధానాలను వారు వివరించుకోలేరా? ప్రత్యర్థుల్లో, ప్రభుత్వాల్లో పాలనాలోపాలను ఎత్తిచూపలేరా? ప్రజల అవసరాల మేరకు నిర్దిష్ట వాగ్దానాలతో ముందుకు వెళ్లలేరా? అన్నది విశ్లేషకుల ప్రశ్న. ఈ విషయంలో ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అని లేదు. అన్ని రాజకీయ పార్టీలు ఒక తాను ముక్కలే. బూతులు మాట్లాడేవాళ్లు, నీచమైన భాషలో రెచ్చిపోయేవాళ్లు, పద్ధతైన విమర్శ అంటే అర్థం కూడా తెలియని నాయకులు నేటి రాజకీయాల్లో అనేకమందే ఉన్నారు. వారందరి గురించి చెప్పుకోవడం దండగ. కనీసం అగ్రనాయకులైనా మారితే బాగుంటుందన్నది ప్రజల ఆకాంక్ష.

బహిరంగ సభల్లో, మీడియా మైకుల ముందు మాట్లాడే ముందు నోరు జాగ్రత్తగా పెట్టుకుంటే అందరికీ మంచిది. మాట పెదవి దాటితే.. దాని ప్రభావం ఒక్కోసారి పదవి చేజారిపోయే ప్రమాదం కూడా ఉంది...!

# నెల్లూరు లోక్‌సభ వైసీపీ అభ్యర్థిగా వీపీఆర్

(మొదటి పేజీ తరువాయి)



ఆధ్యాత్మిక సేవాతత్పరుడిగా రెండు తెలుగురాష్ట్రాలలో ఆయన పేరు సుపరిచితం. ముఖ్యంగా ఆయన సొంత జిల్లా నెల్లూరులో దయార్ద్ర హృదయానికి, మానవీయ విలువలకి మారుపేరు వీపీఆర్. మంచి మనసున్న మానవతావాదిగా ఆయన ప్రసిద్ధి. సేవకి చిరునామా, అవసరమైన చోట నేనున్నానంటూ అభయమిచ్చే ఆపద్బంధువు, దీనజన ఆత్మీయ సింధువు ప్రభాకరరెడ్డి. ఆయన మాటల మనిషి కాదు, చేతల మనిషి. అలాంటి ప్రభాకరరెడ్డి, ఇప్పుడు పరోక్ష రాజకీయాలనుండి ప్రత్యక్ష రాజకీయాలలోకి రానున్నారు. వైసీపీ ఆవిర్భావం నుండి జగన్‌మోహన్‌రెడ్డితో వీపీఆర్‌కి సత్సంబంధాలు ఉన్నాయి. అంతకముందు దివంగత నేత డాక్టర్ రాజశేఖరరెడ్డితో కూడా వేమిరెడ్డికి ఆత్మీయ అనుబంధం ఉండేది. 2014, ఆ తరువాత 2019 ఎన్నికలలో జగన్‌కి అండగా ప్రభాకరరెడ్డి కీలకపాత్ర పోషించారు. తాను తెరవెనుక ఉంటూనే పార్టీ కార్యకలాపాలను నిర్వహించారు. 2018లో అత్యంత క్లిష్ట సమయంలో రాజ్యసభకి వైసీపీ తరపున పోటీచేసి గెలిచారు. ప్రభాకరరెడ్డి కాబట్టే ఆ సీటు వైసీపీకి దక్కింది. ఆయన కాకుంటే అనుమానమే. అంతటి స్థాయిలో ఆయనకి పరపతి, పలుకుబడి ఉన్నాయి.

ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి అభ్యర్థన మేరకు ఆయన లోక్‌సభకి పోటీ చేయడానికి సుముఖత చూపించారు.

1991లో స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి రాజకీయ అరంగేట్రం చేసి కాంగ్రెస్ అభ్యర్థిగా ఒంగోలు నుండి పోటీ చేసినప్పుడు పార్టీలకతీతంగా, వర్గాలకతీతంగా జనం రోడ్లపైకి వచ్చి ఆయన విజయం కోసం కృషిచేశారు. సుబ్బరామిరెడ్డి కూడా ఓ వైపు తాను కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తూనే టీడీపీ నుండి తనపై పోటీచేసిన తన ప్రత్యర్థికి పార్టీ చందా ఇచ్చారని అప్పట్లో రాజకీయవర్గాలు ఆయన వ్యక్తిత్వం గురించి గొప్పగా చెప్పుకునేవి. ఆరోజుల్లో ఎన్.టి.రామారావు దత్తపుత్రుడు రమేష్‌రెడ్డి రాజకీయ భవిష్యత్తుకి ఎన్టీఆర్ పునాది వేస్తే.. ఆ పునాదికి బలం చేకూర్చింది మాగుంట సుబ్బరామిరెడ్డి అన్న సంగతి జగమెరిగిన సత్యం.

ఇప్పుడు సరిగ్గా 32 సంవత్సరాల తరువాత అలాంటి సంఘటనే జిల్లాలో చోటు చేసుకోబోతోంది. వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు కూడా బలపరచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అసెంబ్లీ ఓటు విషయంలో ఎలావున్నా పార్లమెంటుకి మాత్రం తమ ఓటు వీపిఆర్‌కే అని ఇప్పటికే కొంతమంది ఇతర పార్టీల వ్యక్తులు బహిరంగంగానే తమ అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు. మొత్తంమీద 2024 ఎన్నికలలో లోక్‌సభకి వైసీపీ నెల్లూరునుండే తొలి బోణీ కొట్టబోతోందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇలాంటి తరుణంలో మా పెద్దాయన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ప్రజాక్షేత్రంలోకి వచ్చి తన వాగ్ధాటితో ఎన్నికల వాగ్దానాలు కుమ్మరించనవసరం లేదు. ప్రజల మధ్యకి వెళ్లి రెండుచేతులు జోడించి తనను గెలిపించమని అడిగితే చాలు, జిల్లా వాసులు తమ ఆశీస్సులను ఓట్ల రూపంలో ఆయనపై కురిపిస్తారన్న ధీమా ఆయన శిష్య బృందం నుండి వ్యక్తమవుతోంది.

### టీడీపీ రాష్ట్ర పరిశోధన-సమాచార కమిటీ సభ్యునిగా

# మక్కెన అంకయ్యచౌదరి



తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషిచేస్తూ, ఇటీవల జరిగిన శాసనమండలి ఎన్నికల్లో తూర్పు రాయలసీమ అభ్యర్థి కంచెర్ల శ్రీకాంత్ విజయానికి పడిన శ్రమను గుర్తిస్తూ, మక్కెన అంకయ్యచౌదరిని ఇటీవల టీడీపీ రాష్ట్ర పరిశోధన–సమాచార కమిటీలో సభ్యునిగా నియమించారు. అందుకు ఆయన చంద్రబాబునాయుడుకు తన కృతజ్ఞతలు తెలిపారు. ఆ కమిటీలో సభ్యునిగా తన నియామకానికి సహకరించిన యువనేత లోకేష్‌కు, టిడిపి నేత అచ్చెన్నాయుడుకు ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రం మళ్ళీ గాడిన పడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, అందుకు తనవంతు కృషిచేస్తామని ఆయన తెలిపారు.

## వాస్తవాల అధ్యయనానికి సమావేశం

రాష్ట్రంలో వైకాపా పాలన నేపథ్యంలో, ప్రస్తుతం వివిధ రంగాల స్థితిగతులను పూర్తిస్థాయిలో అధ్యయనంచేసి ప్రజలకు తెలియజేసేందుకు తెదేపా సమాయత్తమైంది. ఈ పరిశీలనలో భాగంగా ముఖ్యంగా వ్యవసాయం, నిరుద్యోగం, సర్వీస్ సెక్టార్, రాష్ట్ర అప్పులు, సంక్షేమం–అభివృద్ధి, మహిళల పరిస్థితి వంటి కీలకఅంశాలపై వాస్తవాలను చర్చించేందుకు నివేదిక రూపొందించి ఆగస్టు 11వ తేదీలోగా ఇవ్వాలని, ఆ నివేదికను తాము పార్టీ అధినేత చంద్రబాబునాయుడుకు సమర్పిస్తామని, తుది నివేదిక పూర్తయ్యాక ప్రజలమధ్య చర్చకు పెడతామని తెలుగుదేశం పార్టీ పరిశోధన–సమాచార కమిటీ సభ్యులు, న్యాయవాది మక్కెన అంకయ్యచౌదరి పార్టీ శ్రేణులకు తెలిపారు. ఆమేరకు ఇటీవల జరిగిన సమావేశంలో తనతోపాటు టిడిపి నాయకులు యనమల రామకృష్ణుడు, జివి రెడ్డి, విజయకుమార్, జి.మాల్యాద్రి, గాజుల ఆదెన్న, గురుమూర్తి, జివి ఆంజనేయులు, గంగాధర్ పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు.

# నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి 45వ వర్ధంతి



విద్యావేత్త, విద్యాదాత, సమాజ సేవకులు, సంఘ సంస్కర్త 'పద్మశ్రీ' గ్రహీత నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి 45వ వర్ధంతి ఆగస్టు 3వ తేదీ గురువారం విద్యానగర్‌లోని ఎన్.బి.కె.ఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో జరిగింది. సంస్థ సంచాలకులు డాక్టర్ వి.విజయ్ కుమార్‌రెడ్డితో పాటు బోధనా మరియు బోధనేతర సిబ్బంది బాలకృష్ణారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలకృష్ణారెడ్డి సేవలను గుర్తు చేసుకున్నారు.

తమ సంస్థని రాష్ట్రంలోనే ఉన్నతస్థాయి కళాశాలలకు ధీటుగా తీర్చిదిద్దిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కృషిని విజయకుమార్‌రెడ్డి కొనియాడారు. నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి ఆశయ సాధన దిశగా రామ్‌కుమార్‌రెడ్డి సహకారంతో తమ విద్యా సంస్థలు దినదినాభివృద్ధి చెందుతున్నాయని అన్నారు.



# వైభవంగా పడారుపల్లి గంగమ్మ జాతర

నెల్లూరు రూరల్‌లోని పడారుపల్లి గ్రామంలో కొలువైవున్న శ్రీ గంగమ్మ అమ్మవారి జాతర జులై 31న వైభవంగా జరిగింది. ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ట, మండల పూజలను పురస్కరించుకుని ఈ జాతర నిర్వహించారు. అమ్మవారికి శోభాయమానంగా అలంకరణలు చేసి, విశేషపూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం కనులపండువగా జరిగింది. గంగమ్మ అమ్మవారి బోనాల ఊరేగింపు వేడుక మరింత వైభవంగా జరిగింది. అమ్మవారి నామోచ్చారణతో పడారుపల్లి మార్మోగింది. ఆలయ కమిటీ సభ్యులు, గంగమ్మ అమ్మవారి సేవకుడు కాకుటూరు శ్రీహరి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతరలో పడారుపల్లి నుంచే కాక చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### అమ్మవారిని దర్శించుకున్న ఆదాల

ఈ నేపథ్యంలో ఎంపీ ఆదాల అమ్మవారి ఆలయానికి విచ్చేయడంతో ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఆయన్ను సాదరంగా స్వాగతించి అమ్మవారి సన్నిధిలో పూజలుచేయించి ఆశీర్వదించారు. విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్ దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి, 21, 22 డివిజన్ల కార్పొరేటర్లు మొయిళ్ళ గౌరి, మూలే విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు పాతపాటి పుల్లారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన
# మరో అవినీతి చేప

### రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయిన దేపూరు వీఆర్‌ఓ

జిల్లాలో మరో అవినీతి చేప ఏసీబీ వలకు చిక్కింది. బర్త్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు 16 వేల రూపాయలు లంచం ఇవ్వాలంటూ డిమాండ్ చేసి లంచం తీసుకుంటున్న ఓ వీఆర్‌ఓను ఏసీబీ అధికారులు వల పన్ని పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని ఆత్మకూరు మండలం దేపూరు గ్రామానికి చెందిన రైతు రావిళ్ళ వెంకటేశ్వర్లు తన కుమారుడి బర్త్ సర్టిఫికెట్ కోసం వీఆర్‌ఓ మాల్యాద్రి వద్దకు వెళ్ళాడు. అందుకు రూ.16వేలు ఇవ్వాలని వీఆర్‌ఓ డిమాండ్ చేశాడు. అంతడబ్బు ఇవ్వలేనని రైతు చెప్పినా వీఆర్‌ఓ కనికరించ లేదు. ఎన్నిరోజులు తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో ఆ రైతు విసిగిపోయి ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. పథకం ప్రకారం, వీఆర్‌ఓకి 10వేల రూపాయలు ఇస్తామని చెప్పి, ఆ డబ్బును ఎల్‌ఆర్‌పల్లి వద్ద రైతు ఇస్తుండగా ఏసీబీ డిఎస్పీ మోహన్, సిఐ ఆంజనేయరెడ్డి బృందంలోని సిబ్బంది హఠాత్తుగా దాడిచేసి, లంచం తీసుకుం టున్న వీఆర్‌ఓను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేశారు.


# సరస్వతీదేవికి.. వెండి కిరీటం సమర్పణ



ఆత్మకూరు పట్టణంలోని శ్రీ అలగనందస్వామి దేవాలయంలో కొలువైవున్న శ్రీ సరస్వతీదేవి అమ్మవారికి ఆత్మకూరు నివాసి.. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఎన్‌ఆర్‌ఐ చల్లా రవీంద్ర రెడ్డి, ఆయన సతీమణి రోహిణిలు వెండి కిరీటాన్ని తయారు చేయించారు. వారి కోరిక మేరకు, వారి సన్నిహితులైన విశ్రాంత ఉపాధ్యాయులు కెవి శేషారెడ్డి, గిరిజ దంపతులు జులై 30న ఆ కిరీటాన్ని అమ్మవారి ఆలయానికి సమర్పించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ ప్రత్యేకపూజలు చేసి అమ్మవారికి కిరీటాన్ని ధరింపజేసి అందరినీ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా శేషారెడ్డి దంపతులు సరస్వతీపూజలో పాల్గొన్న చిన్నారులకు నోటు పుస్తకాలు, పెన్‌లు బహూకరించారు.

# సజావుగా చంద్రయాన్ ప్రయాణం

## భూ కక్ష్య నుంచి ఇక చంద్రుని కక్ష్యలోకి




చంద్రునిపై పరిశోధనలు సాగించేందుకు శ్రీహరికోట నుంచి ఇటీవల ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్ రాకెట్ చంద్రుని వైపు తన ప్రయాణాన్ని సజావుగా సాగిస్తోంది. గతనెల 14న చంద్రయాన్ మిషన్-3 నింగిలోకి విజయవంతంగా దూసుకుపోయిన విషయం తెలిసిందే. అది అంతరిక్షంలోని భూకక్ష్యలో పరిభ్రమిస్తూ, ఆ తర్వాత చంద్రుని కక్ష్యలోకి వెళ్ళి ఆగస్టు 23వ తేదీ నాటికి చంద్రయాన్ మిషన్‌లోని ప్రొపల్షన్ మాడ్యూల్ చంద్రునికి 30 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుని, అక్కడి నుంచి మెల్లిగా ల్యాండర్‌ను జారవిడుస్తుంది. నిర్దేశిత సమయం ప్రకారం ఆరోజు సాయంత్రం 5.47 గంటలకు ల్యాండర్ చంద్రుని దక్షిణ ధ్రువం ప్రాంతంలో దిగడం, ల్యాండర్ విచ్చుకుని లోపలనుంచి రోవర్ వెలుపలకి వచ్చి చంద్రునిపై పరిశోధనలకు ఉపక్రమించడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఇస్రో శాస్త్రవేత్తలు జులై 31న ప్రొపల్షన్ మాడ్యూల్‌లో నింపిన ఇంధనాన్ని మండించి చంద్రయాన్ మిషన్-3ను భూ కక్ష్య నుంచి చంద్రుని కక్ష్యవైపు మళ్ళించేందుకు చేయాల్సిన ప్రక్రియనంతా విజయవంతంగా నిర్వహించారు. చంద్రయాన్-3 కక్ష్య దూరాన్ని మరోసారి పెంచారు. అక్కడ నుంచి అయిదురోజుల పాటు చంద్రుడి చుట్టూ దీర్ఘవృత్తాకార కక్ష్యలో పరిభ్రమించి, వంద కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలోకి తీసుకువచ్చేందుకు కనీసం అయిదురోజులు పడుతుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. చంద్రుడి కక్ష్యలోకి చేరుకోవడానికి 17 రోజులు, చంద్రునిపై అడుగుపెట్టడానికి ఇంకా 23 రోజులు పడుతుంది. చంద్రయాన్ మిషన్ చంద్రుని కక్ష్యలోకి వచ్చాక, ల్యాండర్ దిగి, రోవర్‌తో పరిశోధనలు ప్రారంభమయ్యే కీలక దశ కోసం ఇస్రో శాస్త్రవేత్తలే కాదు, ప్రపంచంలోని అనేక దేశాల అంతరిక్ష శాస్త్రవేత్తలు వేయికళ్ళతో ఎదురుచూస్తున్నారు.

# ఆర్చరీ విజేతకు.. శ్రీసిటీ రవి సన్నారెడ్డి సన్మానం



ప్రపంచ ఆర్చరీ పోటీల్లో అండర్-18 గ్రూప్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన గణేష్ మణిరత్నం (17)ను ఇటీవల శ్రీసిటీలో ఘనంగా సన్మానించారు. నాయుడుపేటకు చెందిన హరిప్రసాద్, సుప్రియల కుమారుడు గణేష్ ఇటీవల ఐర్లాండ్ లో జరిగిన ప్రపంచ పోటీల్లో తన సత్తాచాటుతూ పతకం సాధించాడు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆ విషయం తెలుసుకుని గణేష్‌ను శ్రీసిటీకి పిలిపించి సన్మానించడం విశేషం. శ్రీసిటీలో ఫైర్ సేఫ్టీ సమీక్షా సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఏపీ విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ ఎ.రవిశంకర్ తదితర పోలీసు అధికారుల సమక్షంలో రవీంద్ర సన్నారెడ్డి విలువిద్య విజేతను అభినందించి సత్కరించడమే కాక, 11,111 రూపాయలను ప్రోత్సాహక బహుమతిగా కూడా అందజేసి క్రీడల పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. చిన్న వయస్సులోనే విలువిద్య పోటీల్లో పలుసార్లు పతకాలు సాధించిన గణేష్ క్రీడాప్రతిభను ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. ఆర్థిక స్తోమత అంతగా లేకున్నా కుమారుని ఆసక్తిని గమనించి క్రీడల్లో తగు ప్రోత్సాహం అందిస్తున్న గణేష్ తండ్రిని కూడా ఆయన అభినందించారు. మరింత కృషి చేసి భవిష్యత్తులో ఒలింపిక్స్‌లోనూ పాల్గొని భారత్‌కు పతకాలు సాధించిపెట్టాలని ఆయన గణేష్‌కు చెప్పారు.

# మానవజన్మను సార్థకం చేసుకోవాలి



మానవజన్మ ఎంతో శ్రేష్టమైనదని, ప్రతిఒక్కరూ భగవద్భక్తితో ఉంటూ, ధర్మబద్ధమైన జీవనం గడుపుతూ ఆ భగవంతుడు ప్రసాదించిన జన్మను సార్థకం చేసుకోవాలని ఆధ్యాత్మికవేత్త జి.వెంకటేశ్వర్లు సూచించారు. జులై 30న ఆత్మకూరులోని తెలుగుభారతి సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన 'మంచిమాట' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, భాగవతంలోని వైశిష్ట్యాన్ని, భక్తిజ్ఞానవైరాగ్యాలకు సంబంధించిన విశేషాలను వివరించారు. సేవాసమితి నిర్వాహకులు సోమవరపు సుబ్బరాయుడు, అన్నపురెడ్డి పెదవెంకటరెడ్డి, గోవిందరెడ్డి, కొల్లా వెంకటేశ్వర్లు, ఒమ్మిన సుబ్రహ్మణ్యం, కలిశెట్టి రవీంద్రకుమార్, ఎస్‌వి చలమయ్య, కెవి శేషారెడ్డి, యానాదిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెలిశెట్టి నారాయణరావు, టీసివి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...



### లింగనపాలెంలో.. రైతుభరోసా కేంద్రం తనిఖీ

సైదాపురం మండలంలోని లింగనపాలెం గ్రామంలో ఉన్న రైతుభరోసా కేంద్రాన్ని ఇటీవల జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడున్న ఉద్యానశాఖ సిబ్బంది పనితీరు సక్రమంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకనైనా పనితీరు మార్చుకుని, ప్రజలకు మెరుగైన సేవలందించాలని హెచ్చరించారు.

### ఉదయగిరిలో పేకాటరాయుళ్ళ అరెస్ట్

ఉదయగిరిలోని గుల్లపాళెం, షబ్బీర్ కాలనీ సమీపంలో ఉన్న పేకాటస్థావరాలపై జులై 30న పోలీసులు దాడులు జరిపి 10మంది పేకాటరాయుళ్ళను అరెస్ట్‌చేసి, వారివద్ద నుంచి 5880 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. సిఐ గిరిబాబు ఆధ్వర్యంలో పోలీసులు ఈ దాడులు చేశారు. పేకాట రాయుళ్ళపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

### పిడూరుపాలెంలో ఉచిత కంటివైద్య శిబిరం

మనుబోలు మండలంలోని పిడూరుపాలెంలో జులై 28న హారిక కంటివైద్యశాల వారి ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించి వైద్యపరీక్షలు చేశారు. కంటిచూపులో లోపాలున్నవారికి, కంటిరోగులకు డాక్టర్ హరికరెడ్డి ఉచితంగా మందులను పంపిణీచేశారు. ఉజ్వల పాఠశాల కరెస్పాండెంట్ ప్రభాకర్‌రెడ్డి, హెడ్మాస్టర్ చైతన్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### బుచ్చిలో లయన్స్‌క్లబ్ అన్నదానం

బుచ్చిరెడ్డిపాళెం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జులై 31న పేదలకు అన్నదానం నిర్వహించారు. లయన్స్ జోనల్ ఛైర్మెన్ టివి కిషోర్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆ దంపతులు బుచ్చి బస్టాండ్‌సెంటర్‌లో అన్నదానం చేశారు. లయన్స్ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, తిరువీధి రాజేంద్ర, దర్శి బాలు, నరసింహారావు తదితరులు పర్యవేక్షించారు.

### కోవూరులో మల్లికార్జునస్వామికి పల్లకి సేవ

కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో ఉన్న పార్వతీదేవి సమేత శ్రీ మల్లికార్జునస్వామి దేవస్థానంలో జులై 31న స్వామివారికి వైభవంగా పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. ఆలయ ఛైర్మెన్ బి.సురేష్, ధర్మకర్తలు హనుమారెడ్డి, పాటూరు మోహన్, సుధాకర్, వంశీ, నాగరాజు పర్యవేక్షించారు.

### నారంపేటలో విద్యార్థులకు విద్యాసామగ్రి

ఆత్మకూరు మండలం నారంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ గ్రామ నివాసి, ప్రస్తుతం అమెరికాలో స్థిరపడిన గంధం వెంకటేశ్వర్లు జులై 31న నోటుపుస్తకాలు తదితర విద్యాసామగ్రిని అందజేశారు. పిఎంసి ఛైర్మెన్ గంధం పెంచలరావు, హెడ్మాస్టర్ చేరెడ్డి నరేంద్రరెడ్డి, హోలీక్రాస్ అసోసియేషన్ సభ్యులు దార్ల సునీల్‌రాజ్, అనిల్, జావేద్, శివాజీ పాల్గొన్నారు.

### కృష్ణపట్నంలో 'శ్రీవత్స' ఉచిత వైద్యసేవలు

ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నంలో జులై 30న నెల్లూరుకు చెందిన 'శ్రీవత్స' చెస్ట్ అండ్ చిల్డ్రన్స్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి చిన్నారులకు వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కె. చిరంజీవి, డాక్టర్ కె.కల్యాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో గ్రామస్తులు అనేకమంది పాల్గొన్నారు.

### మనుబోలులో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

మండల కేంద్రమైన మనుబోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు జులై 30న ఎస్‌ఐ అజయ్‌కుమార్ కౌన్సిలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని, ఇకనైనా సత్ప్రవర్తనతో మసలుకోకపోతే కఠిన శిక్షలు తప్పవని రౌడీషీటర్లను హెచ్చరించారు.

### జొన్నవాడ రోడ్డుకు రూ. 3.20 కోట్లు మంజూరు

కోవూరు నియోజకవర్గంలోని బుచ్చి-జొన్నవాడ సిమెంట్ రోడ్డు నిర్మాణానికి 3.20కోట్ల రూపాయలను ఆర్‌అండ్‌బి శాఖ ఇటీవల మంజూరు చేసిందని డీఈ హనుమంతరావు తెలిపారు. ఊటుకూరు పట్టపుపాళెం గ్రామానికి రూ. 60లక్షలతో తారు రోడ్డు నిర్మాణానికి కూడా నిధులు మంజూరయ్యాయని చెప్పారు.

# క్యాన్సర్ ఆసుపత్రి చిరకాల కల నెరవేరింది
# పూర్తిస్థాయి సాంకేతికత సమకూరింది



గత ఒకటిన్నర దశాబ్దానికిపైగా జిల్లాలోని క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు చికిత్స అందిస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి ఇప్పుడు పూర్తిస్థాయి వైద్య సాంకేతిక సమకూరింది. రేడియేషన్ కొరకు ఉపయోగించే అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన లీనియర్ యాక్సలరేటర్ యంత్రాన్ని (Linear Accelerator Machine) గత గురువారం జులై 27వ తేదీ టీటీడీ ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి, ఆయన సతీమణి స్వర్ణ ప్రారంభించారు. ఈ యంత్రాన్ని ఇక్కడ ఏర్పాటుచేయాలన్నది జిల్లా వాసుల చిరకాల కల. క్యాన్సర్ వ్యాధి బాధితులు ఇప్పుడు పూర్తిస్థాయి రేడియేషన్ కోసం ఇతర ప్రాంతాలకి వెళ్లనవసరం లేదు. మహానగరాలలో ఉండే రేడియేషన్ సదుపాయం ఇప్పుడు మన నెల్లూరులో అందుబాటులోకి వచ్చింది. ఈ యంత్రంతో పాటు ఇంకా పలు సౌకర్యాలను వైవీ సుబ్బారెడ్డి, స్వర్ణ, నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకరరెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మెన్, శాసనమండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, 'జక్కా సుజాతమ్మ క్యాన్సర్ డిటెక్షన్ సెంటర్' దాత జె.ఎస్. రెడ్డిలతో కలసి ప్రారంభించారు.

నూతన సీటీ స్కాన్ యంత్రంతో పాటు, కొత్త రేడియేషన్ వార్డుని, ఐసీయూ విభాగాన్ని అందుబాటులోకి తెచ్చారు. సెంబ్‌కార్ప్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ వారి సహకారంతో సుమారు కోటి రూపాయల విలువైన 150 కేవీఏ సామర్థ్యం కలిగిన సోలార్ విద్యుత్ పరికరాన్ని కూడా ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేశారు.

నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి సహకారంతో ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న రోగులతో పాటు వారితో పాటు ఉండే అటెండెంట్లకు, ఆసుపత్రి అవసరాలకు సరిపడా త్రాగునీరు అందించడం కోసం ఆర్.ఓ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేశారు.

ఆసుపత్రి మొత్తం తిరిగి పరిశీలించిన సుబ్బారెడ్డి దంపతులు, ఆసుపత్రి నిర్వహణలో రెడ్‌క్రాస్‌తో పాటు ఆసుపత్రి సిబ్బంది చేస్తున్న కృషిని అభినందించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నడుస్తున్న క్యాన్సర్ ఆసుపత్రిని పూర్తిస్థాయిలో క్యాన్సర్ రోగుల అవసరాలను తీర్చేవిధంగా అభివృద్ధి చేయడానికి తమవంతు చేయూతనిచ్చి ఆర్థిక సహకారాన్ని అందిస్తున్న దాతలను సుబ్బారెడ్డి అభినందించారు. రెడ్ క్రాస్ కార్యవర్గం, ఆసుపత్రి కమిటీ సభ్యులు, సిబ్బంది, పలువురు వైద్య ఆరోగ్య విభాగ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## టిడిపి నాయకులకి, కార్యకర్తలకి అండ
# సోమిరెడ్డి రచ్చబండ
### ➤ ఇక 3 నెలలపాటు జనంలోనే



ఎన్నికల కాలం సమీపిస్తున్న తరుణంలో మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మూడునెలల పాటు ప్రజల మధ్యనే ఉండేలా 'రచ్చబండ' పేరుతో కార్యక్రమాన్ని చేపట్టారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా సర్వేపల్లి నియోజకవర్గంలో నిత్యం ఏదోఒక చోట అరెస్టులు, దౌర్జన్యాలు, విధ్వంసాలు జరుగుతూనే ఉన్నాయని, ఇక ఆలా జరగబోనివ్వనని ఆయన ప్రతిజ్ఞ బూనారు.

మూడు నెలల్లో సర్వేపల్లిలోని ప్రతి ఊరికీ వస్తా.. కాకాణి సంగతి తేలుస్తా... అంటూ ఆగష్టు 2వతేది తోటపల్లిగూడూరు మండలం వెంకన్నపాలెంలో రచ్చబండ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. తన రచ్చబండ కార్యక్రమంతో పార్టీశ్రేణులకు భరోసా కల్పిస్తానని అన్నారు.

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రకృతి వనరులతో పాటు ప్రజలను కూడా దోచేస్తున్నాడని ధ్వజమెత్తారు. ఓవైపు కోట్ల రూపాయలు ఆర్జిస్తూ, మరోవైపు టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ కక్షసాధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. నియోజకవర్గంలోని ప్రతి ఊరిలో, ప్రతి కాలనీలో రచ్చబండ నిర్వహించి కాకాణి దారుణాలను ప్రజలకు వివరిస్తానని చెప్పారు.

ప్రజల దాహం తీర్చడం కోసం ప్రయత్నించిన టీడీపీ నేత ఈపూరు సుబ్బారెడ్డిని అక్రమకేసులతో అరెస్టు చేయించారు. మాచర్లవారిపాళెంలో దళితుల ఇళ్లు కూల్చివేయించాడు. తాళ్లపూడిలో నారా లోకేష్‌కు హారతి పట్టారని బీసీల బంకు పగలగొట్టించాడు. ఆములూరు మల్లికార్జున నాయుడిని స్టేషన్‌లో పెట్టించాడు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వెంకటాచలం వడ్డిపాళెం యువకుడు యనమల రాజేంద్ర మిత్రబృందంపై హత్యాయత్నం కేసు పెట్టి 40రోజులు జైలులో పెట్టించాడు. మల్లికార్జునపురం నుంచి గిరిజనులు లోకేష్ సభకు వచ్చారని చర్చి మూయించేశాడు. వీరంపల్లిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగితే, వైసీపీ మద్దతుదారులు కాకాణి నీడలో ఉన్నారని, టీడీపీవాళ్లు మాత్రం జైలులో ఉన్నారని సోమిరెడ్డి ధ్వజమెత్తారు.

వైసీపీ ప్రభుత్వం ఏర్పడక ముందునుండే సోమిరెడ్డి కాకాణిల మధ్య యుద్ధం నడుస్తోంది. పార్టీ అధికారంలోకి వచ్చాక ఆ వైరం ఇంకా ముదిరింది. ఇన్నాళ్లు ప్రకటనలకి, ప్రెస్‌మీట్లకే పరిమితమైన వీళ్లిద్దరి పోరు ఇప్పుడు వీధికెక్కనుంది. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం ఒకరిది. అధికారం, అంగబలం, అర్థబలం మరొకరిది. అంతిమ విజయం ఎవరిదో తెలియాలంటే.. మరికొద్ది నెలలు వేచి చూడాల్సిందే...!









ఆహ్వానము

శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటి

మరియు

శ్రీవాణి

శ్రీసిటి ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక

సంయుక్త ఆధ్వర్యంలో

శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యుల వారి

614వ జయంతి సందర్భంగా

అన్నమయ్య సంకీర్తనావళి

అర్థం - ఆలాపన - అభినయం

తేది: 12.08.2023, శనివారం

సా॥ 6.00 గంటల నుండి మినీబైపాస్, అన్నమయ్య సర్కిల్‌లోని
పి.వి.ఆర్ కళ్యాణ మండపము నందు జరుగును.

శ్వేత మాజీ సంచాలకులు
భూమన్ గారిచే
భావ వ్యక్తీకరణ

టిటిడి అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు
కె.సరస్వతీ ప్రసాద్ గారిచే
గానాలాపన

శ్రీ గురుకృప కళాక్షేత్రం, నెల్లూరు వారిచే
నాట్యారాధన

గమనిక : సా॥ 5.30 గంటలకు మినీబైపాస్‌లోని అన్నమయ్య విగ్రహం వద్ద పూజా కార్యక్రమము నిర్వహించి, అనంతరం అక్కడ నుండి పి.వి.ఆర్ కళ్యాణ మండపం వరకు అన్నమాచార్య నగర సంకీర్తన నిర్వహింపబడును.

ఆధ్యాత్మిక, సంగీత, సాహిత్య, సాంస్కృతిక ఆరాధకులు, భక్తులు పై కార్యక్రమాలలో పాల్గొని కార్యక్రమ అనంతరం తీర్థప్రసాదములు స్వీకరించవలసిందిగా మనవి.

గమనిక : కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు ఖచ్చితంగా సంప్రదాయ దుస్తులు ధరించి రావలెను.

## భక్తిశ్రద్ధలతో చండీహోమం



పౌర్ణమిని పురస్కరించుకుని నెల్లూరులోని మూలాపేటలో ఉన్న శంకరమఠంలో భక్తిశ్రద్ధలతో చండీహోమం నిర్వహించారు. మఠంలో కొలువై వున్న కంచి కామాక్షిదేవి సమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో ఈ కార్యక్రమం అద్యంతం నేత్రపర్వంగా జరిగింది. మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిషోర్, ఉషాకుమారిల పర్యవేక్షణలో వేదపండితులు సోమేశ్వరశర్మ ఈ హోమ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు సాయి, మురళి పాల్గొని స్వామివార్లకు విశేషపూజలు చేశారు.

## మునిసిపల్ కార్మికుల కష్టాలు తీర్చండి

### ○ కావలిలో సిఐటియు ఆందోళన

మునిసిపల్ కార్మికుల సమస్యలను తీర్చాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పారిశుద్ధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ఆగస్టు 1న కావలిలో సిఐటియు ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రోజువారీ కార్మికులకు వేతనాలు పెంచాలని, కార్మికులకు ఇవ్వాల్సిన పనిముట్లను ఇవ్వాలని, కావలి పట్టణం బాగా విస్తరిస్తున్న దృష్ట్యా అందుకు తగ్గట్టుగా పారిశుద్ధ్య కార్మికులను కూడా పెంచాలని డిమాండ్ చేశారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.పెంచలనరసయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు రెహానాబేగం, సిఐటియు నాయకుడు పసుపులేటి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం మునిసిపల్ కమిషనర్‌కు తమ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం సమర్పించారు.



# బీజేపీ గూబ గుయ్...!



"POWER CORRUPTS. ABSOLUTE POWER CORRUPTS ABSOLUTELY" అనేది బాగా పాపులర్ అయిన నానుడి. 19/20వ శతాబ్దపు ఆంగ్లేయ చరిత్రకారుడు లార్డ్ యాక్టన్ చెప్పిన ఈ మాట అక్షరసత్యంగా నిలిచిపోయింది.

'కరప్ట్' అంటే.... లంచాలు తీసుకోవడం అనే కాదు. కరప్ట్ అంటే 'అధికార మదం' అని కూడా అర్థం చేసుకోవచ్చు. అధికారం ఎంత పెరిగితే, ఈ 'మదం' అంత పెరుగుతుంది. దీంతో, అహంభావం... అధికారం జంట సర్పాల్లాగా పెనవేసుకుపోయి నృత్యం చేస్తుంటాయి. సమస్త వ్యవస్థలు ఈ జంట సర్పాలకు పాదాక్రాంతం అయిపోతాయి. న్యాయవ్యవస్థ సైతం దీనికి మినహాయింపు కాదు. బితుకు బితుకుమంటూ రోజులు వెళ్ళదీస్తుంటుంది.

'పవర్' యొక్క పవర్ అది. ఆ పవరే పరిపూర్ణంగా దొరికినప్పుడు, ఇక ఆ చూపు, నడక, మాట తీరు, వ్యవహారశైలి, గాంభీర్యం ఎలా ఉంటాయి?

మన ప్రధాని నరేంద్ర మోడీలాగా ఉంటాయి అని విమర్శకులు అంటుంటారు.

ఆయన విమర్శలను లెక్కచేయరు. సీబీఐ, ఈడీ, ఇన్‌కమ్ టాక్స్, కాగ్ వంటి సంస్థలను తనకు గిట్టని వారిపైకి వేటకుక్కల లాగా ఉసిగొలుపుతారని ప్రతిపక్షాలు గగ్గోలుపెడుతున్నాయి. ప్రతిపక్షాల వారిని అవినీతిపరులుగా చూపించడమే ఆయన లక్ష్యం. బీజేపీలో అవినీతిపరుల గురించి పొరపాటున కూడా ప్రస్తావించరు. బీజేపీ నేతల అవినీతిపై ఆయన స్పందించరు.

బీజేపీలో అవినీతి అనే కాదు, దేశంలో జరిగే ఏ ఆరాచకంపై అయినా ఆయన స్పందించరు. మీడియాతో మాట్లాడరు.

దేశంలోని 29 రాష్ట్రాలలోనూ బీజేపీ ప్రభుత్వాల ఏర్పాటు కోసం మోడీ అహరహం శ్రమిస్తారు. దానికోసం కేంద్రప్రభుత్వ అధికారాలను ఎంత విస్తారంగా, ఎంత విస్తృతంగా వాడడానికైనా వెనుకాడరు.

ప్రధానిగా పార్లమెంట్ మెట్లకు తల ఆనించి, మొదటిసారిగా సభలోకి అడుగుపెట్టిన మోడీని చూసి, దేశం ఉప్పొంగిపోయింది. జవహర్‌లాల్ తరువాత, అంతటి ప్రజాస్వామికవాది దేశానికి లభించారని మురిసిపోయింది.

ఆ మురిపెం మూణ్ణాళ్ళముచ్చటే అయిపోయింది. పార్లమెంట్ సభ్యుల విమర్శలకు స్పందించరు. పూర్వకాలపు చక్రవర్తులు, మహారాజులు లాగా ఈరోజు వేసిన దుస్తులు రేపు వెయ్యరు. 64 దేశాలను 100సార్లకుపైగా సందర్శించారు.

ప్రతిపక్షాలు చీలికలు, పీలికలుగా తయారవడంతో నరేంద్ర మోడీ పవర్... మరింత పరిపూర్ణమైన పవర్ అయింది.

తను, తన ఇమేజ్ ముందు ఆయనకు ఏదీ ముఖ్యం కాదనే దశకు నరేంద్ర మోడీ చేరుకున్నారా అనిపిస్తుంటుంది. అలా అనిపించినప్పుడల్లా... ఆంగ్లేయ చరిత్రకారుడు లార్డ్ యాక్టన్ చెప్పిన "POWER CORRUPTS, ABSOLUTE POWER CORRUPTS ABSOLUTELY" గుర్తుకు వస్తుంటుంది. దేశంలో బీజేపీ ప్రతిష్ఠకు ఇబ్బంది అనిపించే ఏ సంఘటన చోటు చేసుకున్నప్పటికీ, నరేంద్ర మోడీ స్పందించరు. వీలైతే, ఏదో ఒక విదేశీ పర్యటనకు వెళ్ళిపోతారు. భారతదేశ చరిత్ర, అభివృద్ధి తన ప్రధానమంత్రిత్వంతోనే మొదలైందని చెప్పడానికి ఆయన ఏమీ మొహమాటపడరు.

నరేంద్ర మోడీ అంటే బీజేపీ.... బీజేపీ అంటే నరేంద్ర మోడీ అన్నట్టుగా దేశ ప్రజల కళ్ళకు కప్పిన మాయ తెరలను తొలగించి, 'అసలు మోడీ'ని చూపించేందుకు ప్రతిపక్ష పార్టీలు చేతులు కలపడంతో బీజేపీలో కలవరం మొదలైన సూచనలు స్పష్టంగా కనపడుతున్నాయి.

ఆయన సంపూర్ణాధికారం చేపట్టిన నాటి నుంచి, ఎన్‌డీఏ అనే మాటే వినడానికి ఇష్టపడని మోడీ, ఇప్పుడు ఎన్డీఏ... ఎన్డీఏ అంటూ కలవరిస్తున్నారు. దేశంలోని చిల్లర, మల్లర... లోక్‌సభ స్థానం ఒక్కటీ లేని పార్టీలను, ఎన్నికల సంఘం గుర్తింపులేని పార్టీలనూ పోగేసి... 'మాకు 38 పార్టీలు ఉన్నాయ్... చూసుకోండి...' అని చెప్పుకోవలసిన స్థితిలో బీజేపీ పడిపోయింది.

నిజానికి కేంద్రంలో బీజేపీ(మోడీ) రెండోసారి గెలవడమే వింత అని 2019లో పెద్దఎత్తున వ్యాఖ్యానాలు వినపడ్డాయి.

తెలంగాణలో టీఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ విజయాలకు కూడా, 'ఏదో జరిగింది... ఏదో జరిగిపోయింది... లేకపోతే, మరీ ఇంత...' అనే ఆశ్చర్యార్థకాలు వినిపించాయి. అయినప్పటికీ మోడీ మళ్ళీ ప్రధాని అయ్యారు. ఆయన ప్రతిష్ఠ ద్విగుణీకృతం అయింది. అధికారంపై ఆయన పిడికిలి బిగింపు అనేది కూడా ద్విగుణీకృతం అయింది.

మరో ఏడెనిమిది నెలల్లో మూడోసారి మరో మూడొందల పాతిక సీట్లతో, అధికారపీఠంపై కూర్చోవాలని అనుకుంటున్న భారత చక్రవర్తి లాంటి మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీకి మనసు కష్టపెట్టుకునే సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

అందులో రెండు ప్రధాన సంఘటనలు చెప్పుకోవాలి.

1. ప్రతిపక్షాలుగా మోడీ – షా ఈసడింపులకు, ఛీత్కారాలకు గత తొమ్మిదేళ్లుగా గురవుతూ వస్తున్న ప్రతిపక్షాలలో ముఖ్యమైనవాటిలో అత్యధికం ఓ చోటుకు చేరడం. 2. మణిపూర్‌లో తెగల మధ్య నిరాఘాటంగా జరిగిపోతున్న 'అంతర్యుద్ధం'.

ఒక్క చోటుకు చేరిన ప్రతిపక్షాలు, తమ కూటమికి ఒక పేరు పెట్టుకోవడం బీజేపీ(మోడీ)కి నచ్చలేదు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్‌గాంధీ ఏకబిగిన పాదయాత్ర చేయడం బీజేపీకి నచ్చలేదు. కర్ణాటక రాష్ట్రంలో అధికారం కోల్పోవడం బీజేపీకి నచ్చలేదు.






సార్వత్రిక ఎన్నికల ముంగిట దేశం ఉన్నప్పుడు, తన ప్రతిష్ఠను దెబ్బతీసే పలు ఘటనలు వరుసగా చోటుచేసుకోవడం బీజేపీకి మనశ్శాంతి లేకుండా చేస్తున్నాయి.

ఇవి చాలావన్నట్టు, మణిపూర్‌లో సామూహిక హత్యలు, సామూహిక దోపిడీలు, సామూహిక గృహ దహనాలు, సామూహిక మానభంగాలు, మహిళా మూర్తులను బహిరంగంగా వివస్త్రలను చేసి రోడ్లపై నడిపించడం... వంటి ఘటనలు గోధ్రా ఘోరకలిని జ్ఞప్తికితెచ్చాయి. అయినా, మణిపూర్ అధికార, పోలీసు యంత్రాంగం... నాటి గోధ్రా ఘటనల నాటి అధికార పోలీసుయంత్రాంగ పనితీరును ఆదర్శంగా తీసుకున్నట్టుగా వ్యవహరించింది.

మూడు నెలలుగా సాగుతున్నప్పటికీ, మణిపూర్ ఘోరకలిపై ప్రధాని నోరు మెదప లేదు. ఈలోపు, గ్యాప్ లేకుండా విదేశీ పర్యటనలకు వెళ్ళి వచ్చారు. బయట పల్లకీ మోత మోగించారు. ఇంట్లో ఈగల మోతను నామమాత్రంగా కూడా ప్రస్తావించ లేదు. రెండు 'మన్‌కీ బాత్'లను దేశప్రజలతో పంచుకున్నారు.

ఈ కామెడీ చూస్తున్న ప్రతిపక్ష కూటమికి కడుపు మండిపోయింది.

ఈ ఘటనలపై ప్రధాని ఒక ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రధాని స్పందించలేదు. పార్లమెంట్‌లో ఒక్క గొంతుకతో నినదించారు. ప్రధాని స్పందించలేదు. పదిరోజుల పాటు పార్లమెంట్‌ను స్తంభింపచేశారు. ప్రధాని స్పందించలేదు. వారంతా కలిసి మణిపూర్ వెళ్లి రెండు రోజుల పాటు వివిధ తెగలు, వర్గాలకు చెందిన బాధితులతో మాట్లాడి, గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చి వచ్చారు. అయినా, ప్రధాని స్పందించలేదు.



మనదేశం... పార్లమెంటరీ ప్రజాస్వామ్యం రక్షణలో ఉంది తప్ప, పార్లమెంటరీ నియంతృత్వంలో కాదనే విషయాన్ని మన ప్రధానికి గుర్తు చేయడానికి "అవిశ్వాస" అస్త్రాన్ని ఉమ్మడి ప్రతిపక్షం ఇం.. డి.. యా బయటకు తీసింది. ఏకంగా 150 మంది సభ్యులతో కూడిన కూటమి ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసును... పరిగణనలోకి తీసుకోవడం తప్పలేదు. దీనికి ప్రధాని సమాధానం చెప్పి తీరాలి.

"ఆయనకు గొంతు నొప్పిగా ఉంది. ఈయన మాట్లాడతారు...." అంటూ ప్రభుత్వ పెద్దలు తప్పించుకోడానికి వీలు లేదు.

ఇక్కడి దాకా పరిస్థితి రాకముందే, ప్రధాని గనుక మణిపూర్ ఘటనలపై ఒక ప్రకటన చేసి ఉంటే, ఆయన ఎంతో హుందాగా వ్యవహరించారు అనే భావం దేశ వాసులకు కలిగి ఉండేది.ప్రజల దృష్టిలో మోడీ ఇమేజ్, గౌరవం మరింత ఇనుమడించి ఉండేవి. కానీ, ఆయన ఆ అవకాశం ప్రజలకు ఇవ్వలేదు. ఇప్పుడు... ప్రకటన చెయ్యకా ఆయనకు తప్పడం లేదు. ఆ "విజయం" ప్రతిపక్షాల ఖాతాలో పడకా తప్పడం లేదు.

పులి మీద పుట్రలా సుప్రీం కోర్టు రంగంలోకి సుమోటోగా దిగేసింది. ప్రధాన న్యాయమూర్తి ప్రభుత్వాల నిర్వాకంపై కళ్లెర్రజేశారు.

సుప్రీం కోర్టు మాటల్లో....

"కనీ వినీ ఎరుగని ఘోరం ఇది. మహిళల్ని పోలీసులే సాయుధ మూకలకు అప్పగించారు. సంఘటన జరిగిన 14 రోజులకా ఎఫ్ఐఆర్ నమోదు చేసేది? ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకుండా ఎవరు అడ్డుకున్నారు? ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని మేమే నియమించాలనుకుంటున్నాం. కుంటి సాకులు కుదరదు. కమాన్! మణిపూర్ డీజీపీ, కోర్టుకు రండి. మొత్తం వివరాలు తీసుకురండి. ఎన్ని హత్యలు, దోపిడీలు, గృహ దహనాలు, మానభంగాలు చోటుచేసుకున్నాయి? ప్రతి ఘటనలోనూ ఎప్పుడు ఘటన జరిగితే.... ఎప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు? ఘటన వారీగా ఎంతమందిని అరెస్ట్ చేశారు? ఎప్పుడు చేశారు? కోర్టులకు ఏఏ ఘటనలు నివేదించారు. ఆయా సంఘటనలు పునరావృతం కాకుండా ఏమి చర్యలు తీసుకున్నారు. మొత్తం సమాచారంతో రండి...." అంటూ సర్వోన్నత న్యాయస్థానం హుకుం జారీచేసింది.

సుప్రీం కోర్టు సంధించిన వాగ్బాణాలతో, ప్రతిపక్షాల కూటమికి కొత్త బలం వచ్చింది. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి అని ప్రతిపక్షం ద్విగుణీకృత సమరోత్సాహంతో నినదిస్తోంది.

బీజేపీ(మోడీ) ప్రతిష్ఠకు ఇంత భంగం కలిగినప్పటికీ మణిపూర్ ప్రభుత్వానికి నేతృత్వం వహించే ముఠాను తొలగించడానికి మోడీ అంగీకరించరు. ఆ ప్రభుత్వ యంత్రాగానికి నేతృత్వం వహించేది... బీజేపీ చక్రాంకితులు కావడమే ఇందుకు కారణం. అందులోనూ సార్వత్రిక ఎన్నికలకు ముందు...

ఒకటి మాత్రం స్పష్టం.

ప్రతిపక్షాలకు ఎంతో కొంత బుద్ధి వచ్చిందనేది వాస్తవం.

గతంలో కంటే... రాహుల్‌గాంధీ ఇప్పుడు సీరియస్ పొలిటీషియన్‌గా దేశ ప్రజలకు కనపడుతున్నారు. ఆ విషయం కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ప్రాక్టికల్‌గా తెలిసివచ్చి ఉంటుంది.

ప్రధాని పదవికి ఎవరు అనేది ముఖ్యం కాదు... మోడీ దిగిపోవడం ముఖ్యం అనే లక్ష్యంతో ప్రతిపక్షాలు కదులుతున్నాయి.

2014 నుంచి అలవోకగా, నయాగరా జలపాతంలోని నీటి ధారలా సాగిపోతున్న సత్యాసత్య, అనితర సాధ్యమైన మేనరిజంలు, హావభావాల కలగలుపు, వ్యంగ్య, ఏకపక్ష నోటి తుంపర్లకు ఈసారి అడ్డుకట్టపడుతుంది. అది ఎంత బలంగా పడుతుందనేదే చూడాలి.

ఈ క్షణానికైతే, బీజేపీ ఆత్మరక్షణలో పడింది. అటు పార్లమెంటుకూ సమాధానం చెప్పుకోవాలి, ఇటు సుప్రీం కోర్టుకూ సమాధానం చెప్పుకోవాలి. బోర విరుచుకు తిరగడానికి కుదరదు. ఈ రెండు రాజ్యాంగ వ్యవస్థలకూ సమాధానం చెప్పుకుంటే.. దేశ ప్రజలకు చెప్పుకున్నట్టే!

- భోగాది వేంకట రాయుడు
medhomadhanam@gmail.com

# శ్రద్ధాంజలి

## 25వ వర్ధంతి



జననం : 18.9.1927 నిర్యాణం : 6.8.1998

మా పెద్ద దిక్కు

**శ్రీ రావూరు సుబ్బారెడ్డి గారు**

పరమపదించి తేది. 06.08.2023 నాటికి
పాతికేళ్ళు నిండుతాయి.

## సంస్మరణ



జననం : 13.4.1932 నిర్యాణం : 27.4.2014

మా ఇంటి దీపం

**శ్రీమతి రావూరు కౌసల్యమ్మ గారు**

దివంగతురాలై తేది.27.04.2023 నాటికి
తొమ్మిదేళ్ళు నిండాయి.

**ఆ పుణ్యమూర్తులిద్దరినీ సంస్మరించుకుంటూ...**

కుమార్తెలు - అల్లుళ్ళు
దేవకి - డాక్టర్ జి.ఆర్.రెడ్డి
నర్మద - లేట్ కె.కృష్ణారెడ్డి
జ్యోతి - లేట్ ఎస్.వి.లక్ష్మీనారాయణరెడ్డి
అరుణ - లేట్ ఆదాల రాఘవరెడ్డి
వింధ్యావళి - ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎం.పి
జమున - ఎస్.సూర్యనారాయణరెడ్డి
అనిత - కె.సుధాకర్‌రెడ్డి

చెల్లెళ్ళు - బావమరుదులు
లేట్ ఎ.బుజ్జమ్మ - లేట్ ఎ.దశరథరామిరెడ్డి
యన్.నవనీతమ్మ - యన్. లక్ష్మీనారాయణరెడ్డి
యన్.సులోచనమ్మ - లేట్ యన్. రామచంద్రారెడ్డి

మరియు

**మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలు, మునిమనుమరాండ్రు**

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com